E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 27-05-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక:144 || పేజీలు–6
www.ekaburu.com

లక్షలిస్తే లైన్ మార్చేస్తాం

ప్రమాదం ముసుగులో చేతివాటం

- హైటెన్షన్ విద్యుత్ లైన్ కు అనుకొని గోపన్ పల్లిలో భారీ అక్రమ నిర్మాణం
- పనులు చేస్తుండగా విద్యుత్ షాక్ తో కార్మికుడికి గాయాలు
- నిర్మాణదారుడితో లాలూచీ - విద్యుత్ వైర్లు రహదారి వైపు మార్పు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : ""అనుమతులు లేని అక్రమ నిర్మాణానికి అడ్డుగా ఉన్న హై టెన్షన్ విద్యుత్ లైన్ రూటే మార్చేశారు. అక్రమ నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికునికి విద్యుదాఘాతం కావడాన్ని ఆసరాగా చేసుకొని ఓ కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా హై టెన్షన్ విద్యుత్ లైన్ కు ఆనుకొని నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణదారుడుకి నోటీసులు ఇవ్వాల్సింది పోయి... నిర్మాణదారుడి వద్ద లక్షలు దండుకొని ఏకంగా విద్యుత్తు లైన్ నే రహదారి వైపు మళ్ళించడం చర్చనీయాంశంగా మారింది. ""

మిగతా 2లో

ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు

- పంచాయతీలు సహా అన్ని శాఖల సిబ్బందికి అమలు
- పింఛనుదారులకు వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో సొమ్ము
- కొత్త పెన్షన్ల మంజూరులో ఒంటరి మహిళలకు ప్రాధాన్యం
- పంచాయతీల సొంత ఆదాయం బ్యాంకుల్లో జమ
- సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

ఈ-కబురు, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లోని 50 వేల మంది సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వీరితోపాటు శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవలు అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటితేదీన ఒకేసారి జీతాలందేలా చూడాలని, ఒక్కరోజు ఆలస్యమైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

02

ఖనిజ సహకారంతో

చైనాకు చెక్!

నాలుగు దేశాల క్వాడ్ కూటమి నిర్ణయం

1.91 లక్షల కోట్లతో 'కీలక ఖనిజాల సహకార కార్యక్రమం'ఖరారు

ఇండో–పసిఫిక్‌లో సముద్ర నిఘా, ఓడరేవుల మౌలిక సదుపాయాలు బలోపేతం

03

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య

రేపు రాజీనామా!

రాజ్యసభ స్థానంతో పాటు సభాపక్ష నేతగానూ అవకాశం

దిల్లీలో అధిష్ఠానం సుదీర్ఘ చర్చలు

తదుపరి సీఎం రేసులో డీకే, పరమేశ్వర్

02

ఇరాన్‌పై అమెరికా నిప్పుల వర్షం

- క్షిపణి ప్రయోగ కేంద్రాలు, మందుపాతరలు అమర్చే పడవలు ధ్వంసం
- కేవలం ఆత్మరక్షణ కోసమే దాడులు చేశామన్న అమెరికా
- అమెరికా దుశ్చర్యను తీవ్రంగా ఖండించిన ఇరాన్

ఈకబురు, వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణతో కొన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్న పశ్చిమాసియాలో మళ్లీ ఒక్కసారిగా అలజడి చెలరేగింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం విషయంలో ముందడుగు వేశామని ఒకవైపు అమెరికా అధ్యక్షుడు చెబుతుండగా, మరోవైపు అమెరికా సైన్యం సోమవారం దక్షిణ ఇరాన్‌పై భీకర దాడులకు పాల్పడింది. బందర్ అబ్బాస్ సహా పలు ప్రాంతాల్లో ఇరాన్ సైనిక స్థావరాలపై నిప్పులు వర్షం కురిపించింది.

02

టీ-వర్క్స్‌ను తీసుకొచ్చింది కేసీఆరే

ఈ-కబురు, హైదరాబాద్: తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు టీ-వర్క్స్ అని... దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చింది కేసీఆరే అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఎక్స్'లో ఆయన మంగళవారం టీ-వర్క్స్ పురోగతిపై స్పందించారు. ....(3లో)

రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం

వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కొత్త వ్యూహం

దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ

జూలైలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన

పులివెందులలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తికి నిధుల మంజూరు

03

ఈకబురు,,అమరావతి, మే 26: రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు.

సీఎం, మంత్రుల ఇళ్ల ముందు

ధాన్యం డంప్ చేస్తాం

వారం రోజుల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాల్సిందే

ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ హెచ్చరిక

02

రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రి

03

...ఇది దుర్మార్గపు ప్రభుత్వం

రూ. 1,000 కోట్ల విలువైన 170 ఎకరాలు అన్యాక్రాంతం

ఆర్డీవో సర్కారు భూమి అని అఫిడవిట్ ఇస్తే.. తహసీల్దార్ ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెట్టారు?

దీనిపై సిట్ వేసి విచారణ జరిపించాలి: హరీశ్‌రావు డిమాండ్

03

మావోయిస్టు అగ్రనేత నరహరి లొంగుబాటు

- ఇక దేశంలో మిగిలింది 47 మంది మాత్రమే
- లొంగిపోయిన వారి ఉపాధికి త్వరలో స్కిల్లింగ్ సెంటర్
- గణపతి దేశంలోనే ఎక్కడో రహస్య జీవితం గడుపుతున్నారు
- డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడి రూ.3,877 కోట్ల భారం

మిగతా 3లో

ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు

ఈకబురు, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లోని 50 వేల మంది సిబ్బందికి ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వీరితోపాటు శాశ్వత, ఒప్పంద, పొరుగు సేవలు అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటితేదీన ఒకేసారి జీతాలందేలా చూడాలని, ఒక్కరోజు ఆలస్యమైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు. చేయూత పెన్షనర్లందరికీ వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లోనే నిధులను జమ చేయాలని, తపాలాశాఖ ద్వారా అందజేస్తున్న ప్రస్తుత విధానాన్ని మార్చాలన్నారు. ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వే(ఎస్‌ఈఈపీసీ) డేటా ఆధారంగా పింఛన్లను క్రమబద్ధీకరించాలన్నారు. మంగళవారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ''పెన్షన్ల పంపిణీ పారదర్శకంగా జరగాలి. ఒకేవిధానం కింద పింఛనర్లకు సాయం అందాలి. కొత్త పెన్షన్ల మంజూరీలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రంలోని పంచాయతీ సిబ్బందికి ప్రతీనెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేస్తాం. ఐఏఎస్ అధికారులకు ప్రతి నెలా సమయానికి జీతాలు అందినట్లే.. గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అలాగే జీతాలు అందాలి. వేతనాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీనెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా మంజూరు చేస్తాం. సొంత ఆదాయంపై గ్రామ పంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించాలి. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం పంచాయతీల ఆదాయాన్ని ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమచేసే విధంగా సవరణ చేయాలి'' అని సీఎం ఆదేశించారు. సమావేశంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు దానకిశోర్, సందీప్ సుల్తానియా, కమిషనర్ దివ్యాదేవరాజన్, సీఎంవో కార్యదర్శి మాణిక్‌రాజ్‌లు పాల్గొన్నారు.

సీఎం, మంత్రుల ఇళ్ల ముందు ధాన్యం డంప్ చేస్తాం

ఈకబురు, యాదాద్రి/జనగామ/ఆత్మకూరు: రాష్ట్ర వ్యాప్తంగా మరో వారం రోజుల్లో ధాన్యం వందశాతం కొనుగోళ్లు, లిఫ్టింగ్ చేయని పక్షంలో ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మంత్రులు, సీఎం ఇళ్ల ముందు, అలాగే సచివాలయానికి తీసుకెళ్లి అన్‌లోడ్ చేస్తామని బీజేపీ ప్రతినిధుల బృందం హెచ్చరించింది. రైతుల పక్షాన మాట్లాడినందుకు ఆర్టీసీ డ్రైవర్‌ను సస్పెండ్ చేయడం కాదు.. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే తమను సస్పెండ్ చేసి ఎన్నికలకు వచ్చే దమ్ముందా? అని సవాల్ విసిరింది. రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, ఆర్మూర్, కామారెడ్డి ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, వెంకట్రామ్‌రెడ్డిల బృందం మంగళవారం జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధి కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన ఐకేపీ, మెప్మా ధాన్యం కొనుగోలు సెంటర్‌ను, హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్లలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించింది. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు, భువనగిరి మండలం వడపర్తి లోని ఐకేపీ కేంద్రాన్ని బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించారు. ఆయా కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వారు పడుతున్న బాధలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రకటనలు పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో మొత్తం 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండగా, ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేసింది కేవలం 45 వేల మెట్రిక్ టన్నులు మాత్రమేనని మహేశ్వర్‌రెడ్డి వివరించారు. ఈ లెక్కలు చూస్తే 80 శాతం పూర్తయిందని సీఎం చెప్పే పరిస్థితి ఏమాత్రం లేదని, 30 శాతం కొనుగోలు కూడా జరగలేదన్న వాస్తవం బయటపడుతోందన్నారు. ప్రతి కల్లెం నుంచి పోయే ధాన్యం బస్తాల్లో 10 శాతం 'కటింగ్'పేరుతో జరుగుతున్న భారీ దోపిడీపై మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. ఈ 10 శాతం లెక్కిస్తే మొత్తం 9 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి అదృశ్యమవుతోందని, దాని విలువ సుమారు రూ.2 వేల 160 కోట్లకు పైమాటే అవుతుందని ఆయన తెలిపారు. రైతుల సమస్యలపై బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కల్లాల బాట పట్టడంతోనే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. నిన్న గజ్వేల్‌కు బీజేపీ బృందం వెళ్లడంతో కలెక్టర్ స్వయంగా వచ్చి 30 లారీలను ఏర్పాటు చేశారని, ఇవాళ భువనగిరి కేంద్రానికి వస్తున్నామని తెలియగానే లారీలు వస్తున్నాయని చెప్పారు. ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ రైతుల పక్షాన మాట్లాడినందుకు కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. బీజేపీ ప్రతినిధి బృందంలో భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, గూడూరు నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

లక్షలిస్తే లైన్ మార్చేస్తాం...

ప్రమాదం ముసుగులో చేతివాటం...

ఎన్టీఆర్ నగర్ ప్రధాన రహదారిపై అనుమతులు లేకుండా చేపట్టిన భారీ భవనం

హై టెన్షన్ విద్యుత్ లైన్ కు ఆనుకొని ఉన్న భవనం

అదనపు చానల్స్ ఏర్పాటు చేసి రహదారి వైపు మళ్ళించిన విద్యుత్ లైన్

ఈ-కబురు, శేరిలింగంపల్లి :

""అనుమతులు లేని అక్రమ నిర్మాణానికి అడ్డుగా ఉన్న హై టెన్షన్ విద్యుత్ లైన్ రూటే మార్చేశారు. అక్రమ నిర్మాణంలో పనిచేస్తున్న కార్మికునికి విద్యుదాఘాతం కావడాన్ని ఆసరాగా చేసుకొని ఓ కాంట్రాక్టర్, విద్యుత్ శాఖ సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా హై టెన్షన్ విద్యుత్ లైన్ కు ఆనుకొని నిర్మాణం చేపట్టిన అక్రమ నిర్మాణదారుడుకి నోటీసులు ఇవ్వాల్సింది పోయి... నిర్మాణదారుడి వద్ద లక్షలు దండుకొని ఏకంగా విద్యుత్తు లైన్ నే రహదారి వైపు మళ్ళించడం చర్చనీయాంశంగా మారింది. ""

గోపనపల్లిలోని ఎన్టీఆర్ నగర్ లో హై టెన్షన్ విద్యుత్ లైన్ మార్చడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శేరిలింగంపల్లి మండలం గోపనపల్లి ఎన్టీఆర్ నగర్ ప్రధాన రహదారికి అనుకొని ఓ బిల్డర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఏడంతస్తుల భారీ భవన నిర్మాణం చేపట్టాడు. రహదారికి ఇరువైపులా 33 కేవి హై టెన్షన్ విద్యుత్ లైన్ ఉండగా, భవన నిర్మాణం చేపట్టిన బిల్డర్ కనీస సెట్ బ్యాక్ వదిలిపెట్టకుండా విద్యుత్ లైన్ కు ఆనుకొని నిర్మాణం చేశాడు. కొన్ని నెలల క్రితం నిర్మాణంలో ఉన్న ఈ భవనంలో పనులు చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ లైన్ కు తగిలి ఓ కార్మికుడు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో ఆ కార్మికునికి గుట్టు చప్పుడు కాకుండా వైద్యం చేయించి అక్కడి నుంచి పంపించేశారు. హై టెన్షన్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని భావించిన సదరు భవన యజమాని ఓ కాంట్రాక్టర్ ద్వారా విద్యుత్ శాఖ అధికారులను సంప్రదించాడు. లైన్ మార్చాలంటే అంత త్వరగా అయ్యే పని కాదని విద్యుత్ శాఖ అధికారులు తేల్చి చెప్పారు. దీంతో కాంట్రాక్టర్, విద్యుత్ సిబ్బంది కలిసి లైన్ మార్చేందుకు వ్యూహం పన్నారు. లైన్ మార్చేందుకు ఎస్టిమేట్ వేసి డిపార్ట్మెంట్ కు కొంత మొత్తం చెల్లించారు. ఆ తర్వాత అక్రమ నిర్మాణాలకు దూరంగా విద్యుత్తు లైన్ ఉండేటట్లు రహదారి వైపు అదనపు చానల్స్ అమర్చి వైర్లను మార్చేశారు. ఈ తతంగం వెనుక అక్రమ నిర్మాణదారుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

నోటీసులు ఇవ్వని అధికారులు...

గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లో ప్రధాన రహదారిపైన ఉన్న అక్రమ నిర్మాణం హై టెన్షన్ విద్యుత్ లైన్ కు అనుకొని చేపట్టారు. మున్సిపల్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా జీరో పర్మిషన్ తో చేపట్టిన ఈ నిర్మాణం విద్యుత్ లైన్ కు ఆనుకొని చేపడుతున్నా విద్యుత్ శాఖ అధికారులు అడ్డుకోలేదు. భవన యజమాని నిర్లక్ష్యం కారణంగా విద్యుదాఘాతం జరిగిందని తెలిసినా నిర్మాణదారుడికి ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. అంతేకాకుండా హైటెన్షన్ లైన్ కు అతి సమీపంలో అనుమతి లేని... సెట్ బ్యాక్ లేని నిర్మాణం చేపడుతున్నా విద్యుత్తు శాఖ లైన్స్ విభాగం కానీ, ఆపరేషన్ విభాగం కానీ పట్టించుకోలేదు. పైపెచ్చు భవన నిర్మాణదారుడుతో లాలూచీపడి రహదారి వైపు ప్రమాదకరంగా అదనపు చానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ లైన్ ని మార్చడం గమనార్హం. 150 ఫీట్లు ఉండాల్సిన ఈ రహదారి కుంచించుకుపోయి 100 ఫీట్లకు చేరగా, రహదారి వైపు చానల్స్ ఏర్పాటు చేసి చేపట్టిన విద్యుత్ లైన్ మరింత ప్రమాదకరంగా మారింది

కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రేపు రాజీనామా!

ఈకబురు, బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు తథ్యంగా కన్పిస్తోంది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన పదవిని వదులుకోనున్నట్లు తెలుస్తోంది. గురువారం తొలుత సహచర మంత్రులకు అల్పాహార విందు ఇచ్చి, అనంతరం బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్‌కు రాజీనామా పత్రం సమర్పిస్తారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పుపై కొన్నాళ్లుగా కొనసాగుతున్న సందిగ్ధత నడుమ మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నేతలతో పలు దఫాలు చర్చలు జరిపింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, కర్ణాటక రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలాతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు.

సిద్ధరామయ్య సీఎం పదవిని వదులుకొని, రాష్ట్రంలో నాయకత్వ మార్పునకు సహకరించాలని అధిష్ఠానం సూచించినట్లు సమాచారం. అతనికి రాజ్యసభ స్థానంతో పాటు సభలో విపక్ష నేతగానూ అవకాశం ఇస్తామని ప్రతిపాదించినట్లు తెలిసింది. సిద్ధూ కుమారుడు యతీంద్రకు ఉపముఖ్యమంత్రిగానూ అవకాశం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ ప్రతిపాదనలను తొలుత సున్నితంగా తిరస్కరించిన సిద్ధరామయ్య.. తన మద్దతుదారులతో చర్చించి నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. ఖర్గే రాజ్యసభ సభ్యత్వం త్వరలో ముగుస్తుండటంతో ఆయన స్థానాన్ని సిద్ధూతో భర్తీ చేయాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తంగా కర్ణాటక సంక్షోభాన్ని రాజ్యసభ ఎన్నికల సందర్భంగా పరిష్కరించుకోవాలని అధిష్ఠానం తలపోస్తున్నట్లు అర్థమవుతోంది.

డీకేకు చెక్ పెట్టేలా సిద్ధు మెలిక

తాను రాజీనామా చేసినా సీఎం పదవిని కాంగ్రెస్‌కు బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న అహింద వర్గాలకే కేటాయించాలని సిద్ధరామయ్య అధిష్ఠానానికి ప్రతిపాదించారు. 'నాకు వంద మంది ఎమ్మెల్యేల మద్దతుంది. శాసనసభాపక్ష సమావేశంలో ఓటింగ్ ద్వారా ముఖ్యమంత్రినయ్యాను. అహిందలకు అవకాశమిస్తే నా మద్దతు ఉంటుంద'ని ఆయన స్పష్టంచేశారు. దీనికి అధినాయకత్వం సమ్మతిస్తే దళిత నేత, రాష్ట్ర హోంమంత్రి డాక్టర్ జి.పరమేశ్వర్‌కు ఆ అవకాశం దక్కనుంది. మరోవైపు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్.. 2023లో పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండున్నరేళ్ల తర్వాత అధికార పంపిణీలో భాగంగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశమిచ్చి తీరాలని అగ్రనేతల ముందు డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఈ చర్చల అనంతరం కేసీ వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ తాము కేవలం రాజ్యసభ, ఎమ్మెల్సీ ఎన్నికల గురించే మాట్లాడామని ప్రకటించారు. ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న వార్తలన్నీ వదంతులేనని కొట్టిపారేశారు. సీఎం సిద్ధరామయ్య కూడా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో నాయకత్వ మార్పు, మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ అంశాలేవీ చర్చకు రాలేదని పేర్కొన్నారు.



ఇరాన్‌పై అమెరికా నిప్పుల వర్షం

ఈకబురు, వాషింగ్టన్/దుబాయ్: అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణతో కొన్నాళ్లుగా ప్రశాంతంగా ఉన్న పశ్చిమాసియాలో మళ్లీ ఒక్కసారిగా అలజడి చెలరేగింది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం విషయంలో ముందడుగు వేశామని ఒకవైపు అమెరికా అధ్యక్షుడు చెబుతుండగా, మరోవైపు అమెరికా సైన్యం సోమవారం దక్షిణ ఇరాన్‌పై భీకర దాడులకు పాల్పడింది. బందర్ అబ్బాస్ సహా పలు ప్రాంతాల్లో ఇరాన్ సైనిక స్థావరాలపై నిప్పులు వర్షం కురిపించింది. ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలు, సముద్రంలో మందుపాతరలు అమర్చే పడవలను ధ్వంసం చేసినట్లు అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ సోమవారం ప్రకటించారు.

ఇవి కేవలం తమ ఆత్మరక్షణ కోసం జరిగిన దాడులేనని వివరణ ఇచ్చారు. ఇరాన్ దళాల ముప్పు నుంచి తమ సైనికులను కాపాడుకోవడానికి దాడులకు చేయక తప్పలేదన్నారు. అయితే, ప్రస్తుతం కాల్పుల విరమణ కొనసాగుతోంది కాబట్టి తాము చాలా సంయమనం పాటిస్తున్నామని చెప్పారు. అమెరికా దాడుల్లో ఇరాన్‌కు ఏ మేరకు నష్టం వాటిల్లిందన్నది ఇంకా తెలియరాలేదు.పడవలపై అమెరికా దాడులు చేయడంతో నలుగురు ఇరాన్ జవాన్లు మరణించినట్లు 'తబ్నాక్'అనే వార్తా సంస్థ వెల్లడించింది. హార్మూజ్ జలసంధిపై ఉన్న, సైనిక ఓడరేవుతోపాటు విమానాశ్రయం కలిగిన బందర్ అబ్బాస్ నగర పరిసరాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ టీవీ తెలిపింది. తాజా దాడులు కాల్పుల విరమణ ప్రక్రియపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ 7 నుంచి కాల్పుల విరమణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

శాంతి యత్నాలకు భంగం కలిగించొద్దు: ఇరాన్

అమెరికా దాడులను ఇరాన్ మంగళవారం తీవ్రంగా ఖండించింది. ఈ పరిణామాన్ని దురుద్దేశం, విశ్వసనీయత లేమికి సంకేతంగా అభివర్ణించింది. శాంతి యత్నాలకు భంగం కలిగించే చర్యలకు పూనుకోవద్దని సూచించింది. కాల్పుల విరమణను అమెరికా ఉల్లంఘినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ విమర్శించింది. తదుపరి అన్ని పరిణామాలకు అమెరికా బాధ్యత వహించాల్సి ఉంటుందని తేల్చిచెప్పింది.

ఏ దురాక్రమణ చర్యకైనా జవాబు ఇవ్వకుండా ఇరాన్ వదిలిపెట్టదని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, పశ్చిమాసియాలో శాంతి సాధన కోసం ఖతార్‌లో చర్చల కొనసాగుతూనే ఉన్నాయి. ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘేర్ ఘలిబాఫ్ ఈ చర్చల్లో పాల్గొంటున్నారు. చర్చలు సజావుగా సాగుతున్నాయని, ఒప్పందం విషయంలో తాము తొందరపడడం లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం స్పష్టంచేశారు.

అమెరికా డ్రోన్లు, ఫైటర్ జెట్‌ను కూల్చాం: ఐఆర్‌జీసీ

అమెరికాకు బుద్ధి చెప్పామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) ప్రకటించింది. తమ గగనతలంలోకి ప్రవేశించిన అమెరికా డ్రోన్లను, ఒక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు తెలిపింది. అయితే, ఈ ఘటన ఎప్పుడు జరిగిందన్నది బయటపెట్టలేదు.

ఆ యురేనియంను నాశనం చేయాల్సిందే: ట్రంప్

ఇరాన్ వద్దనున్న శుద్ధిచేసిన యురేనియం(అణు ధూళి)ను నాశనం చేయాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అమెరికాకు తరలించి, నాశనం చేయవచ్చని చెప్పారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ(ఐఏఈఏ) ఆధ్వర్యంలో మరొక ఆమోదయోగ్యమైన ప్రదేశంలో నాశనం చేయడానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఆ యురేనియంను అక్కడికక్కడే నామరూపాల్లేకుండా చేసినా అభ్యంతరం లేదన్నారు. ఇరాన్ వద్దనున్న యురేనియంను తమకు అప్పగించాలని, అలాగైతేనే ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అంగీకరిస్తామని ట్రంప్ ఇప్పటిదాకా షరతు విధించిన విషయం విదితమే. కానీ, తాజాగా ఆయన తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు తాజాగా సోషల్ మీడియాలో పోస్టుచేశారు.

రాష్ట్రంలో ఫార్మ్ టు హోమ్ విధానం

ఈకబురు,అమరావతి, మే 26:
రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయం, ఇతర అనుబంధ శాఖలు, ప్రాథమిక రంగంలో 6 మిషన్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసారి రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పీఎండీఎస్ హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్ట పోకుండా పంటలకు కనీస మద్ధతు ధర లభించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారం కూడా తీసుకుని ఏపీలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రకృతి సేద్యం సహా ఎన్ఎంఎన్ఎఫ్ పథకం అమలు కోసం కేంద్రానికి లేఖలు రాయాలని సీఎం నిర్దేశించారు. రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

--అరటికి కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం

కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పంట తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏమేరకు రాష్ట్రంలో తగ్గించగలిగామో అంచనా వేయాలని సీఎం స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మైక్రో న్యూట్రియంట్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యత పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. నేచురల్ ఫార్మింగ్ పై వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. వ్యవసాయ యాంత్రీకరణ పై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల కనెక్టివిటీ, గోదాములు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నట్టు సీఎం వివరించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం వెల్లడించారు. పశు దాణాతో పాటు సైలేజ్‌ను తక్కువ వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

--బ్లూ ఎకానమీగా ఆక్వారంగం అభివృద్ధి

పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3 కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సీఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సీడీ అంశంపైనా ముఖ్యమంత్రి కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సీడి ఇస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లు ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లోనూ చేపల పెంపకం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. అలాగే సముద్ర తీరంలో మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం రూ.240 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. బ్లూ ఎకానమీ దిశగా ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు బజార్లను ఆధునికంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో 90 నియోజకవర్గాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. డిజి రైతు బజార్ యాప్‌ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రి

ఈకబురు,,హైదరాబాద్ :
రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రి అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గపు ప్రభుత్వమని అన్నారు. ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత బాధితులు, ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ బాధితులతో కలిసి మంగళవారం లోక్ భవన్ లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో సమావేశం అయ్యారు. వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు, ట్రిపుల్ ఆలైన్ మెంట్ మార్పులు, రాయగిరిలో ట్రిపుల్ ఆర్ కోసం భూ సేకరణ, కడ్లాపూర్ లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో పేదల భూములను లాక్కునేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్ కు వివరించారు. అనంతరం లోక్ భవన్ బయట మీడియాతో మాట్లాడారు. రేవంత్ సర్కార్ పేదలకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని గవర్నర్ ను కోరామని చెప్పామన్నారు. తాము చెప్పిన అంశాలను గవర్నర్ ఓపోకతో విన్నారని, కచ్చితంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

రేవంత్ రెడ్డి కర్కోటక సీఎం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల పట్ల అత్యంత కర్కోటకంగా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని కవిత మండిపడ్డారు. కేవలం వంద రూపాయల చీర ఇచ్చి ఆడవాళ్లను కోటీశ్వరులు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి అబద్దాలు చెబుతున్నాడని విమర్శించారు. వెలుగుమట్లలో ఆడబిడ్డ నవ్య ఇల్లు కూలగొట్టి వారికి మనశ్శాంతి లేకుండా చేశారన్నారు. వెలుగుమట్ల లో ఇళ్లు కూల్చుతుంటే ఓ మహిళకు గర్భస్రావం అయ్యిందని..వాళ్ల భర్త రోదన ఇప్పటికీ మాకు వినబడుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో ఏ రైతు కూడా సంతోషంగా లేడని చెప్పారు. కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయటం కూడా ఈ ప్రభుత్వానికి చేతకావటం లేదని విమర్శించారు. ఈ ముఖ్యమంత్రి విమానంలో ఢిల్లీకి వెళ్తూ ఫ్లైట్ నుంచి చూస్తే కల్లాల్లో ధాన్యం కనిపించటం లేదేమో అన్నారు. వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

గవర్నర్ న్యాయం చేస్తారన్న నమ్మకం ఉంది

ఖమ్మంలోని వెలుగుమట్ల, పరిగిలోని ఇండస్ట్రీయల్ పార్క్ కోసం ల్యాండ్ కోల్పోతున్న బాధితులు, ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల కోసం తాము పోరాడుతున్న విషయం తెలిసిందేనని కవిత గుర్తు చేశారు. వారికి న్యాయం జరగాలన్న ఉద్దేశంతో బాధితులను తీసుకెళ్లి గవర్నర్ ను కలిశామన్నారు. ధర్మసమాజ్ పార్టీ, టీఆర్ఎస్ కలిసి చేసిన పోరాటంతో ఈ అంశాల్లో పాక్షికంగా విజయం సాధించామన్నారు. వెలుగుమట్ల లో భూ బాధితులకు అక్కడే ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వటంతో పాటు పరిగి, ట్రిపుల్ ఆర్ సేకరణ ను తాత్కాలికంగా ఆపేశారని గుర్తు చేశారు. ఐతే పూర్తి స్థాయిలో నిర్వాసితులకు న్యాయం జరగాలంటే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఇందులో భాగంగానే గవర్నర్ ను కలిసి ఆయనకు అన్ని వివరాలు అందజేశామన్నారు. ట్రిపుల్ ఆర్ ఆలైన్ మెంట్ ను నాలుగు సార్లు మార్చిన విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆశ్చర్యపోయారన్నారు. దీనికి సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాసిన లేఖకు కూడా గవర్నర్ కు అందజేశామన్నారు. తాము చెప్పిన అంశాలను కూలంకషంగా విన్నారని కవిత చెప్పారు. ఆయా అంశాలకు సంబంధించి రిపోర్ట్ తెప్పించుకోని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. గవర్నర్ కచ్చితంగా న్యాయం చేస్తారన్న నమ్మకంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి కొన్ని రోజులు సమయం ఇచ్చి ఆ తర్వాత సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ పోరాట బాట పడతామని తేల్చి చెప్పారు.

లక్ష ఎకరాలు కొల్లగొట్టే కుట్ర

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో లక్ష ఎకరాల భూమి కొల్లగొట్టేందుకు పథకం పన్నాడని ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆరోపించారు. ఫోర్త్ సిటీ, ట్రిపుల్ ఆర్, పరిగి ఇండస్ట్రీయల్ కారిడర్, వెలుగుమట్ల లో భూ దోపిడీకి ప్లాన్ వేశారన్నారు. దీని పై ఎవరికి చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఇక చివరకు రాజ్యాంగ పరిరక్షకులైన గవర్నర్ ను కలిసి ఆయనకు విన్నవించామన్నారు. కచ్చితంగా ఆయన న్యాయం చేస్తారని నమ్మకం ఉందన్నారు. లేదంటే తర్వలోనే పెద్ద ఎత్తున నిరసన తెలిపే కార్యక్రమాలు చేస్తామన్నారు. లక్ష ఎకరాలు కాపాడేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు, అవసరమైతే మహసభ ఏర్పాటు చేస్తామన్నారు. పేదలకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.

రూ. 1,000 కోట్ల విలువైన 170 ఎకరాలు అన్యాక్రాంతం

ఈకబురు, హైదరాబాద్: శంషాబాద్ మండలం పెద్దషాపూర్ గ్రామంలో 173 నుంచి 183 సర్వే నంబర్ల మధ్య సుమారు రూ.1,000 కోట్ల విలువైన 170 ఎకరాల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేశారని అసెంబ్లీలో భారాస పక్ష ఉపనేత టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఇది ప్రభుత్వ భూమి అని ఆర్డీవో హైకోర్టుకు అఫిడవిట్ ఇవ్వగా.. అదే భూమిని స్థానిక తహసీల్దార్ ప్రైవేటు వ్యక్తులకు ఎలా కట్టబెట్టారని ఆయన ప్రశ్నించారు. ఈ భూ కుంభకోణంలో ఎవరెవరి పాత్ర ఉందో నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం సిట్ వేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ''ఈ భూమి పరాధీనం కాకుండా కాపాడాలని.. ప్రొహిబిటరీ లిస్టు 22ఎలో పెట్టాలని ఆర్డీవో.. తహసీల్దార్‌ను ఆదేశించారు. ఇదే విషయాన్ని 2026 జనవరి 30న హైకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో పొందుపర్చారు. ఫిబ్రవరి 24న సర్కారు భూమే అని తహసీల్దార్ తేల్చారు కూడా. కానీ నాలుగు రోజుల తర్వాత.. ఫిబ్రవరి 28న ఈ భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందుతుందని ఆయన ఆదేశాలిచ్చారు. అంతే కాదు.. ఈ భూమిని భూ భారతి ఆన్‌లైన్‌లో కూడా పెట్టారు. ఒకే భూమిపై ఆర్డీవో, తహసీల్దార్ రెండు భిన్నమైన అఫిడవిట్‌లు ఇచ్చారు. ఏ ఆర్డర్ అయినా కలెక్టర్ అనుమతితోనే హైకోర్టుకు వెళ్తుంది. మరి రెండు అఫిడవిట్లను కలెక్టర్ ఎలా అనుమతిచ్చారు? ఈ స్కాం గురించి బయటకు పొక్కగానే.. కేవలం తహసీల్దార్‌ను బదిలీ చేసి ఊరుకున్నారు. ఇందులో ముఖ్యమంత్రి అతి సన్నిహితుడు ఉన్నారు కాబట్టే.. ఏసీబీ చర్యలు తీసుకోలేదు. తహసీల్దార్‌ను కాపాడుతున్న ఆ పెద్దలెవరు? భూ భారతిలో భూమిని నమోదు చేయాలంటే.. దరఖాస్తు పెట్టాలని.. ఆర్డీవో దాన్ని ఆమోదించాలని భూభారతి చట్టం చెబుతోంది.

కానీ తహసీల్దార్ భూ భారతిలో పెట్టాలని చెప్పగానే.. ఆ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట పట్టా అని పొందుపర్చారు. ఇందులో ప్రభుత్వ పెద్దల జోక్యం లేకపోతే.. వెంటనే తహసీల్దార్‌ను సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలి. ఆ భూమిని తిరిగి నిషేధిత జాబితాలో పెట్టాలి. ప్రభుత్వ భూమిని కాపాడాలి'' అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. జగిత్యాలలో ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్ వేటు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. ''రైతుల కష్టాలు చూడలేక.. ధాన్యం కొనుగోలు చేయాలని ఆయన అడిగారు. అది తప్పు ఎలా అవుతుంది? ప్రశ్నించే ప్రజాస్వామ్య పరిరక్షణ హక్కును మీ ప్రభుత్వం ఏడో గ్యారంటీగా ఇచ్చిన విషయాన్ని మరిచిపోతున్నారా? వెంటనే డ్రైవర్ అశోక్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

సింగరేణిలో ఆ 40 లక్షల టన్నుల బొగ్గు ఏమైంది?: హరీశ్

సింగరేణిలో రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు ఉందని అధికారిక వెబ్‌సైట్‌లో చూపిస్తున్నారని.. వాస్తవానికి గనుల్లో ఆ బొగ్గు లేనేలేదని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. ఆ బొగ్గు ఏమైందో ఉప ముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క చెప్పాలని, ఒకవేళ ఆ నిల్వలు ఉంటే.. అక్కడే తాను క్షమాపణలు చెబుతానని హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ''సింగరేణిలోనూ పెద్ద కుంభకోణం జరుగుతోంది. 40 లక్షల టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు సింగరేణి లెక్కలు చూపిస్తోంది. అవి ఉన్నాయా? లేదా? పరిశీలించడానికి అఖిలపక్షంతో వెళ్లడానికి నేను సిద్ధం. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం కూడా దీనిపై స్పందించాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. 2014లో సింగరేణికి కేటాయించాల్సిన బకాయిలు రూ.2 వేల కోట్లు మాత్రమే. తర్వాత టీఎస్ జెన్‌కో నుంచి రూ.7 వేల కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సింగరేణికి కేటాయించాల్సిన బకాయిలు రూ.21 వేల కోట్లు. రాష్ట్ర ప్రభుత్వ ఓవర్ డ్రాఫ్ట్ (ఓడీ) రూ.3,200 కోట్లు కాగా.. అంతకంటే అధికంగా సింగరేణి ఓడీ రూ.4 వేల కోట్లు ఉంది. సింగరేణిని ఈ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చింది. బొగ్గు గనుల్లో అవినీతి జరుగుతోందని భారాస ప్రశ్నిస్తే.. కేంద్రం ఓ కమిటీని వేసింది. ఆ కమిటీ ఏం తేల్చిందో పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేస్తున్నా'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టీ-వర్క్స్ ను తీసుకొచ్చింది కేసీఆరే

ఈకబురు, హైదరాబాద్: తెలంగాణ భవిష్యత్తును ప్రపంచానికి పరిచయం చేసిన విజన్ పేరు టీవర్క్స్ అని... దాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చింది కేసీఆరే అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. 'ఎక్స్'లో ఆయన మంగళవారం టీవర్క్స్ పురోగతిపై స్పందించారు. 'కేసీఆర్ ఆలోచనల్లో పుట్టి, యువత చేతుల్లో సాంకేతిక శక్తిగా మారిన గొప్ప వేదిక ఇది. స్టార్టప్‌లకు కేవలం మాటల ప్రోత్సాహం కాదు.. ప్రపంచ స్థాయి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చింది నాటి భారాస ప్రభుత్వం. నేడు దేశం మొత్తం డ్రోన్లు, డిఫెన్స్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ గురించి మాట్లాడుతుండగా, తెలంగాణలో ఆ బీజం ఎన్నో ఏళ్ల క్రితమే కేసీఆర్ నాయకత్వంలో పడింది. టీవర్క్స్ అనేది ఒక భవనం కాదు. తెలంగాణ యువత కలలకు రెక్కలు తొడిగిన ప్రయోగశాల. మేక్ ఇన్ తెలంగాణ అనే ఆత్మవిశ్వాసానికి ప్రతీక. దేశంలోనే అతిపెద్ద ప్రొటోటైపింగ్ సెంటర్‌ను తీసుకొచ్చి.. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా నిలబెట్టిన దూరదృష్టి కేసీఆర్‌దే. ఇప్పుడు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్న ఈ సంస్థ తెలంగాణ అభివృద్ధి ఎంత ముందుచూపుతో సాగిందో మరోసారి నిరూపిస్తోంది'' అని కేటీఆర్ వివరించారు.

పల్లెల్లోనూ ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు

ఈకబురు, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వాహనాలు(ఈవీలు) పెరుగుతున్న నేపథ్యంలో వాటికి అందుబాటులో ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)ల ద్వారా వీటిని స్థాపించి, నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించింది. తొలిదశలో 35 సంఘాల పరిధిలోని గ్రామాలను ఎంపిక చేసి.. వచ్చే నెలలో ఛార్జింగ్ స్టేషన్లు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. గత రెండేళ్లలో రాష్ట్రంలోని గ్రామాల్లో 12,041 ఈవీల కొనుగోళ్లు జరిగాయి. ఇంటివద్ద ఛార్జింగ్ పెట్టుకొని వెళ్తూ అది అయిపోతే అందుబాటులో స్టేషన్లు లేక వాహనాలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. సమీపంలోని పట్టణాలు, నగరాల్లోని ఛార్జింగ్ స్టేషన్లకు వెళ్లాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇటీవల దీనిపై సమావేశం నిర్వహించగా.. ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు సహకారశాఖ ముందుకొచ్చింది. వీటి ద్వారా ఈవీ వినియోగదారులకు సౌలభ్యంతోపాటు సంఘాలకు ఆదాయం లభిస్తుందని ఆ శాఖ పేర్కొంది.. దీనికి సీఎస్ ఆమోదం తెలిపారు. సహకార శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్ ఆదేశాలతో ఆ శాఖ అన్ని జిల్లాల అధికారులతో చర్చించి తొలిదశలో 8 ఉమ్మడి జిల్లాల్లోని 35 చోట్ల స్థాపించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అనంతరం ఉన్నతాధికారులు రాష్ట్ర పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(రెడ్కో) అధికారులతో సమావేశం నిర్వహించి, వాటి ఏర్పాటుకు ప్రణాళికను ఖరారు చేశారు.

ఏర్పాటు ఇలా...

ఒక్కో ఛార్జింగ్ స్టేషన్‌కు రూ.20 లక్షలు వ్యయం అవుతుండగా.. అందులో పీఎం ఇడ్రైవ్ పథకం కింద రూ.13 లక్షల రాయితీ అందుతుంది. మిగిలిన రూ.7 లక్షలను సహకార సంఘాలు భరిస్తాయి. ఒక కిలోవాట్ అవర్(కేడబ్ల్యూహెచ్) ఛార్జింగ్ చేయడానికి రూ.18గా ప్రతిపాదించారు. మార్కెట్ ధరలకు అనుగుణంగా దానిని పెంచుతారు. డిమాండ్‌ను బట్టి ఆయా స్టేషన్లలో అదనపు గన్‌ల ద్వారా సామర్థ్యాన్ని విస్తరిస్తారు. సహకార సంఘాలు వీటి కోసం పెట్టే పెట్టుబడి 3 నుంచి 4 సంవత్సరాల్లో తిరిగి వస్తుందని అంచనా వేశారు. రాష్ట్రంలో 908 ప్రాథమిక సహకార సంఘాలుండగా క్రమంగా మిగిలిన వాటిలోనూ ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు.

మావోయిస్టు అగ్రనేత నరహరి లొంగుబాటు

ఈకబురు, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, బిహార్‌ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ(బీజేసాక్) కార్యదర్శి పసునూరి నరహరి ఎలియాస్ విశ్వనాథ్(64) జనజీవన స్రవంతిలో కలిసినట్లు డీజీపీ సీవీ ఆనంద్ ప్రకటించారు. నరహరితోపాటు ఆయన భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మేదర దానమ్మ ఎలియాస్ జోబా ఎలియాస్ పూనం(55) సైతం అజ్ఞాతం వీడినట్లు వెల్లడించారు. వీరిద్దరి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీకి మిగిలి ఉన్న ఏకైక తూర్పు ప్రాంతీయ బ్యూరో(ఈఆర్‌బీ) పతనం అంచుకు చేరుకుందన్నారు. ఈ మేరకు మంగళవారం తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను డీజీపీ వెల్లడించారు. నరహరిపై ఉన్న రూ.25 లక్షల రివార్డును, దానమ్మ పేరిట ఉన్న రూ.20 లక్షల రివార్డులను చెక్కుల రూపంలో అందజేశారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ... ''పార్టీకి అస్తిత్వం లేదని భావించి నరహరి దంపతులు అజ్ఞాతం వీడారు. తీవ్ర అనారోగ్యంతో 15 రోజుల క్రితమే మావద్దకు రావడంతో చికిత్స అందించాం. తెలంగాణలో 2024 నుంచి 822 మంది మావోయిస్టులు లొంగిపోయారు. పోలీసుల కృషితోపాటు ప్రభుత్వ పునరావాసంపై పెరుగుతున్న విశ్వాసాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. లొంగిపోయిన వారిలో నైపుణ్యాల్ని వెలికితీసి ఉపాధి కల్పించడం ద్వారా వారిని సమాజంలో మమేకం చేసేందుకు స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయబోతున్నాం. ప్రస్తుతం తెలంగాణ నుంచి గణపతితోపాటు ఆయన భార్య, జోడె రత్నాబాయి ఎలియాస్ సుజాత, వార్తశేఖర్ ఎలియాస్ మంగ్తూ మాత్రమే పార్టీలో ఉన్నారు. గణపతి దేశంలోనే ఎక్కడో రహస్య జీవితం గడుపుతున్నట్లు సమాచారముంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో దేశవ్యాప్తంగా 47 మాత్రమే మిగిలారు. ఎవరు లొంగిపోయినా పునరావాసం కల్పిస్తాం'' అని హామీ ఇచ్చారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడికి చెందిన నరహరి వరంగల్ ఎల్‌బీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగానే ఆర్ఎస్‌యూ కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. 1982లో అప్పటి పీపుల్స్‌వార్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి పులి అంజయ్య ప్రేరణతో పార్టీలో చేరారు. తొలుత సుక్మా జిల్లా కుంట దళంలో చేరిన నరహరి... 198688 మధ్య హైదరాబాద్ సిటీ ఆర్గనైజర్‌గా, బెంగళూరులో డెన్‌కీపర్‌గా, 199097 మధ్య దండకారణ్యంలో దక్షిణబస్తర్ సాంకేతిక విభాగంలో పనిచేశారు. 200004 మధ్య కేంద్ర సాంకేతిక కమిటీ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఈక్రమంలో తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, గ్రనేడ్లు, బూబీట్రాప్(ఉచ్చు)ల తయారీలో నైపుణ్యం సంపాదించారు. ఆయుధాల ఉత్పత్తి, మరమ్మతులపై పార్టీ క్యాడర్‌కు శిక్షణ ఇచ్చారు. 2006 నుంచి బీజేసాక్ కార్యకలాపాల్ని పర్యవేక్షిస్తూ 2017లో కేంద్రకమిటీకి ఎంపికయ్యారు. ప్రస్తుతం బీజేసాక్ కార్యదర్శిగా పనిచేస్తూ అజ్ఞాతం వీడారు. '

ఖనిజ సహకారంతో చైనాకు చెక్!

ఈకబురు, అరుదైన ఖనిజాల ఉత్పత్తి, ఎగుమతుల విషయంలో చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టడానికి నాలుగు దేశాల క్వాడ్ కూటమి 'కీలక ఖనిజాల సహకార కార్యక్రమాన్ని'ప్రారంభించింది. అరుదైన ఖనిజాల సప్లై చైన్లను బలోపేతం చేయడానికి ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో 20 బిలియన్ డాలర్ల (1.91 లక్షల కోట్లు) వరకు ఖర్చు చేయబోతున్నట్లు ప్రకటించింది. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడును అడ్డుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఆ ప్రాంతంలో సముద్ర నిఘా, ఓడరేవుల మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాలని క్వాడ్ విదేశాంగ మంత్రులు తీర్మానించారు. అలాగే ఇంధన రంగంలో సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. మంగళవారం ఢిల్లీలో క్వాడ్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ విదేశాంగ మంత్రులు మార్కో రూబియో, పెన్నీ వాంగ్, తోషిమిత్సు మొతేగి పాల్గొన్నారు. నాలుగు దేశాల మధ్య సంబంధాలు, పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. 'కీలక ఖనిజాల సహకార కార్యక్రమాన్ని'ఖరారు చేశారు. సమావేశం అనంతరం ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. దేశాలు తమ సొంత మార్గాలను నిర్ణయించుకోవడానికి, సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి వీలు కల్పించే స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో-పసిఫిక్‌కు మద్దతును పునరుద్ఘాటిస్తున్నామని పేర్కొన్నారు. ఆ ప్రాంతానికి స్పష్టమైన ప్రయోజనాలు చేకూర్చేందుకు సహకారాన్ని మరింత పెంపొందించుకోవాలని, నిర్దిష్టమైన కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించామని తెలిపారు. అక్కడ ఏకపక్ష చర్యలు వద్దు హార్మూజ్ జలసంధి గుండా ప్రపంచ వాణిజ్యం నిరాటంకంగా సాగాలని విదేశాంగ మంత్రులు స్పష్టంచేశారు. అక్కడ వాణిజ్య నౌకలపై ఇరాన్ సుంకాలు విధించడాన్ని తప్పుపట్టారు. అలాగే తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రంలోని పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ శాంతి, స్థిరత్వానికి ముప్పు కలిగించే, బలప్రయోగంతో అస్థిరపరిచే లేదా ఏకపక్ష చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తేల్చిచెప్పారు. చైనా తీరుపై మండిపడ్డారు. సముద్ర వనరుల అభివృద్ధిలో జోక్యం చేసుకోవడం, నౌకాయానం, విమానయాన స్వేచ్ఛకు పదేపదే ఆటంకం కలిగించడం సరైంది కాదన్నారు. ఆ ప్రాంతంలో ప్రమాదకరమైన విన్యాసాలు చేయడం మానుకోవాలని చైనాకు తేల్చిచెప్పారు. తూర్పు చైనా సముద్రం, దక్షిణ చైనా సముద్రంలో శాంతి, స్థిరత్వాన్ని భగ్నం చేసే చర్యలు మానుకోవాలని చైనాను పరోక్షంగా హెచ్చరించారు. క్వాడ్ ఎజెండాలో భాగంగా కీలక, అరుదైన ఖనిజాల ఒప్పందం, ఇండో-పసిఫిక్ ఇంధన భద్రతా కార్యక్రమాన్ని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. భేటీ అనంతరం ఆయన మాట్లాడారు. చర్చలు, ద్వైపాక్షిక సంప్రదింపుల్లో ఎక్కువ భాగం ప్రపంచ ప్రస్తుత పరిస్థితిపైనే జరిగాయని చెప్పారు. సహజంగానే, చర్చల ప్రధాన ఉద్దేశం ఇండో-పసిఫిక్‌కు సంబంధించిన అంశాలేనని అన్నారు. సురక్షితమైన, నిరాటంకమైన సముద్ర వాణిజ్యంపై చర్చించామని, ఎవరైనా సరే అంతర్జాతీయ చట్టాలను కచ్చితంగా పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. స్వేచ్ఛాయుత, బహిరంగ ఇండో-పసిఫిక్‌కు అనేక కోణాలు, పార్శ్వాలు ఉన్నాయని, వాటిలో సాధించిన పురోగతిని క్వాడ్ సమావేశం సమీక్షించిందని జైశంకర్ ఉద్ఘాటించారు. నాలుగు దేశాల మధ్య ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహించాలని, సప్లై చైన్లను బలోపేతం చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు.

2.5 సెకన్లలో 100 కి.మీ. గరిష్ఠ వేగం

ఇటలీకి చెందిన విలాస కార్ల తయారీ సంస్థ ఫెరారీ, తొలి పూర్తిస్థాయి 5 సీట్ల విద్యుత్ వాహనం (ఈవీ) లూచాయ్‌ను ఆవిష్కరించింది. ఇటాలియన్‌లో లూచాయ్ అంటే లైట్ అని అర్థం. అంటే అమిత వేగంతో ప్రయాణిస్తుందని తెలిసేలా పేరును నిర్ణయించింది. ఈ కారు ధర 5,00,000 యూరోలు (సుమారు రూ.6 కోట్లు). గంటకు 310 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుంది. 2.5 సెకన్ల లోనే 100 కి.మీ గరిష్ఠ వేగాన్ని అందుకుంటుంది. బూస్ట్ మోడ్‌లో 1,000 హార్స్‌పవర్ కంటే ఎక్కువ పవర్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఈ వాహనంలో మినిమలిస్ట్ క్యాబిన్ విత్ ఓఎల్ఈడీ డిస్‌ప్లేలు, రొటేటింగ్ టచ్‌స్క్రీన్, ఏవియేషన్ స్టైల్ కంట్రోల్స్ ఉన్నాయి. 122 కిలోవాట్ బ్యాటరీ ప్యాక్, 800వి ఆర్కిటెక్చర్‌తో రూపొందింది. ఒకసారి ఛార్జింగ్‌తో 500 కి.మీ. పైగా ప్రయాణించొచ్చని ఫెరారీ చెబుతోంది. 350 కిలోవాట్ ఫాస్ట్ ఛార్జింగ్ సామర్థ్యం కలిగిన ఈ కారుకు నాలుగు డోర్లు ఉన్నాయి.

ప్రతి ఒక్కరికీ పబ్లిక్ వైఫై

కేంద్ర మంత్రి పెమ్మసాని ప్రకటన

దిల్లీ: పీఎం వాణి ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలందరికీ పబ్లిక్ వైఫై అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం టెలికాం అధికారులతో పీఎం వాణి (పైమ్‌మినిస్టర్ వైఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) అమలుపై సమీక్షించారు. విద్యార్థులు, ప్రయాణికులు, చిరు వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరికీ ప్రజా వైఫై అందించేందుకు, క్యూఆర్ కోడ్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. మొబైల్ ద్వారా క్యూఆర్‌కోడ్ స్కాన్ చేసుకుని, సులభంగా ల్యాప్‌ట్యాప్‌తో కనెక్ట్ చేసుకునే వ్యవస్థ రూపొందిస్తున్నామని వెల్లడించారు. వినియోగదారుల కోసం 15, 30, 60 నిమిషాల పథకాలు ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రైల్వే స్టేషన్లు, బస్‌టెర్మినళ్లు, మాల్స్, ఇతర బహిరంగప్రదేశాల్లో పీఎం వాణి హాట్‌స్పాట్‌లను సులభంగా గుర్తించేందుకు వీలుగా ప్రామాణిక గుర్తులు తెస్తున్నామని పేర్కొన్నారు.

ఏఐలో అగ్రగామి కావడానికి భారత్‌కు మంచి అవకాశం

మైక్రోసాఫ్ట్ ప్రతినిధి జై పారిఖ్

దిల్లీ: ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ)ను విస్తృతంగా ప్రజల్లోకి, పరిశ్రమల్లోకి తీసుకువెళ్లే తదుపరి దశలో భారత్ అగ్రగామిగా నిలవడానికి మంచి అవకాశాలు ఉన్నాయని మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (కోర్ ఏఐ) జై పారిఖ్ అభిప్రాయపడ్డారు. దేశంలో ఉన్న అపారమైన డెవలపర్ బేస్‌లు, కంపెనీలు వేగంగా ఏఐ అందిపుచ్చుకోవడం, పటిష్ఠమైన డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు ఇందుకు ప్రధాన కారణాలని తెలిపారు. మంగళవారం ఒక బ్లాగ్ పోస్ట్‌లో భారత్ ప్రగతిని ఆయన ప్రశంసించారు. అంతర్జాతీయంగా ఓపెన్ సోర్స్ ప్రాజెక్టులకు సహకారం అందించడంలో భారత డెవలపర్లు ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నారు. ఏఐ సంబంధిత ప్రాజెక్టుల కోసం వీరు 75 లక్షల కంటే ఎక్కువ కాంట్రిబ్యూషన్లు అందించారని అన్నారు. హైపర్‌స్విచ్, ఈఆర్‌పీ నెక్స్ట్, టూల్‌జెట్, బ్రూనో వంటి భారత్‌లో రూపొందించిన ఓపెన్ సోర్స్ ప్రాజెక్టులను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా డెవలపర్లు వినియోగిస్తున్నారు. 'ఏఐ తదుపరి దశ ఎవరు అత్యుత్తమ మోడళ్లను నిర్మిస్తారనే దానిపై ఆధారపడి ఉండదు. నమ్మకం, వేగం, వాస్తవిక ప్రపంచం ప్రభావంతో ఆ మోడళ్లను ఎవరు పెద్ద యెత్తున ప్రజల్లోకి తీసుకెళ్లగలరు అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ఆ మార్పులకు భారత్ కచ్చితంగా సరిపోతుంది' అని పారిఖ్ పేర్కొన్నారు. భారత కార్పొరేట్ రంగంలో ఏఐ వినియోగం వేగంగా పెరుగుతోందని గుర్తుచేశారు. ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలు దేశ వృద్ధికి బలమైన పునాదిగా మారాయన్నారు.

ఏఐ వల్ల 'ఉద్యోగాల వినాశనం' రాదు

ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్

కృత్రిమ మేధ (ఏఐ) వేగంగా వృద్ధి చెందుతున్నా, దాని వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు తుడిచిపెట్టుకుపోయే పరిస్థితి రాదని ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ మంగళవారం స్పష్టం చేశారు. ఇంతకు ముందు తాను భయపడినంతగా ఈ సాంకేతికత వైట్‌కాలర్ (సాఫ్ట్‌వేర్/కార్పొరేట్) ఉద్యోగాలను హరించలేదని పేర్కొన్నారు. సిడ్నీలో జరిగిన కామన్‌వెల్త్ బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియా (సీబీఏ) సదస్సులో దృశ్యమాధ్యమ పద్ధతిలో పాల్గొన్న ఆల్ట్‌మన్, సీబీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ మ్యాట్ కామిన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

అంచనాలు తప్పినందుకు సంతోషంగా ఉంది

2022లో చాట్‌జీపీటీని ప్రారంభించినప్పుడు చేసిన సాంకేతిక అంచనాలు నిజమయ్యాయి కానీ, దాని వల్ల సమాజం, ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావం విషయంలో 'తప్పుగా అంచనా వేశాం' అని ఆల్ట్‌మన్ అంగీకరించారు. 'ఈ విషయంలో నా అంచనా తప్పినందుకు చాలా సంతోషిస్తున్నాను. ఇప్పటికే చాలా వరకు ప్రారంభ స్థాయి వైట్ కాలర్ ఉద్యోగాలు పోతాయని భావించాను. కానీ వాస్తవానికి అలా జరగలేదు' అని అన్నారు. గతంలో చేసిన హెచ్చరికల వల్ల, మార్కెట్‌లో కొంత భయాందోళనలు రేగిన మాట నిజమేనని.. అయితే ఒక ప్రమాదం సంభవిస్తుందని అనుకున్నప్పుడు, దాని గురించి ముందే మాట్లాడటం సరైనదని అప్పట్లో భావించామని ఆల్ట్‌మన్ వివరించారు.

ఉద్యోగాల్లో మానవ పాత్ర భర్తీ చేయలేనిది

ఏఐ ఎంత చురుగ్గా పనిచేస్తున్నా, ఉద్యోగాల్లో ఉండే 'మానవ భాగస్వామ్యం' లేదా మానవీయ కోణాన్ని ఏ సాంకేతికత కూడా భర్తీ చేయలేదని ఆల్ట్‌మన్ చెప్పారు. స్లాక్, ఇమెయిల్ సందేశాలకు సమాధానాలు ఇవ్వడానికి తాను స్వయంగా ఏఐ ఉపయోగించానని, ఇది శామ్ ఏఐ అని బదులిచ్చేలా సెట్ చేశానని గుర్తుచేసుకున్నారు. ఆల్ట్‌మన్ ఎటువంటి కచ్చితమైన ఉద్యోగాల గణాంకాలను ప్రస్తావించనప్పటికీ.. అమెజాన్, హెచ్ఎస్‌బీసీ, స్టాండర్డ్ చార్టర్డ్, సీబీఏ వంటి పలు అంతర్జాతీయ కంపెనీలు ఇప్పటికే తమ సంస్థల్లోని కొన్ని విభాగాల ఉద్యోగాలను ఏఐతో భర్తీ చేస్తున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుతం ఇదే ధోరణి మార్కెట్‌లో కొనసాగుతోంది. ఓపెన్‌ఏఐ రాబోయే కొన్ని వారాల్లోనే అమెరికాలో ఐపీఓ కోసం ముసాయిదా పత్రాలను దాఖలు చేయడానికి సిద్ధమవుతోంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువను అందుకోవాలని, కనీసం 60 బిలియన్ డాలర్ల (రూ.5.7 లక్షల కోట్లు) నిధులను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుందని సమాచారం.

అమెరికా సైనిక చర్యలు పడేశాయ్!

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,407.87 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,361.43 కోట్లు

దక్షిణ ఇరాన్‌పై అమెరికా మళ్లీ సైనిక దాడులు చేపట్టడంతో, ముడి చమురు ధర పెరిగింది. మంగళవారం సూచీలు నష్టాల్లో ముగియడానికి ఇది ప్రధాన కారణమైంది. ఆర్థిక, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు, బలహీన రూపాయి కూడా సూచీలు పడిపోవడానికి ఉపకరించాయి. డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజు కావడంతో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరించారు. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 44 పైసలు తగ్గి 95.70 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.85% శాతం పెరిగి 99.84 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా సూచీ లాభపడింది. జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ ప్రతికూలంగా కదలాడాయి.

సూచీలు నష్టపోయినా, బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2,000 కోట్లు పెరిగి, రూ.468.71 లక్షల కోట్ల (4.91 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 76,224.14 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,488.96 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. ఒక దశలో 76,627.04 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకినా, తర్వాత విక్రయాల ఒత్తిడితో ఇంట్రాడేలో 75,909.68 పాయింట్ల కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 479.26 పాయింట్ల నష్టంతో 76,009.70 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 118 పాయింట్ల నష్టంతో 23,913.70 పాయింట్ల వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 షేర్లలో 23 నష్టపోయాయి. భారతీ ఎయిర్‌టెల్ 1.51%, ట్రెంట్ 1.4%, టీసీఎస్ 1.35%, బజాజ్ ఫైనాన్స్ 1.25%, టైటన్ 1.24%, కోటక్ బ్యాంక్ 1.03%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, ఎం అండ్ ఎం 1% చొప్పున తగ్గాయి. టెక్ మహీంద్రా 1.66%, ఎటర్నల్ 0.99%, హెచ్‌యూఎల్ 0.55% పెరిగాయి. రంగాల వారీ సూచీలకొస్తే మన్నికైన వినిమయ వస్తువులు, టాప్ 10 బ్యాంక్స్, స్థిరాస్తి, హాస్పిటల్స్, పీఎస్‌యూ బ్యాంక్, బ్యాంకెక్స్ రంగాలు డీలాపడ్డాయి. యుటిలిటీస్, లోహ, విద్యుత్, భారీ యంత్ర పరికరాల రంగాలు రాణించాయి. బీఎస్ఈలో 2,067 షేర్లు సానుకూలంగా, 2,139 షేర్లు ప్రతికూలంగా ముగిశాయి.

పాలసీదారుల ప్రయోజనానికే పెద్దపీట

హైదరాబాద్: బీమా రంగంపై పాలసీదారుల నమ్మకాన్ని పెంచడం, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం బీమా కంపెనీల 'ముఖ్య నిర్వహణ అధికారుల' పనితీరును అంచనా వేసే ప్రామాణికాల్లో సవరణలు జారీ చేసింది. కేవలం సంప్రదాయ ఆర్థిక, నిర్వహణ లావాదేవీలకే పరిమితం కాకుండా.. పాలసీదారుల ప్రయోజనాలు, పారదర్శక నిర్ణయాలు, సత్వర స్పందన, స్థిరమైన విలువ సృష్టిపై మరింత దృష్టి సారించాలని ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ అజయ్ సేథ్ స్పష్టం చేశారు. కొత్త పనితీరు ప్రామాణికాల్లో ఆర్థిక పటిష్ఠత, ఉత్పత్తుల పనితీరు, క్లెయిములపై వేగవంత ప్రతిస్పందన, సకాలంలో ఫిర్యాదుల పరిష్కారం, వినియోగదారులను తప్పుదారి పట్టించే సమాచారాన్ని వెబ్‌సైట్ల నుంచి తొలగించడం వంటివి ప్రధానంగా ఉన్నాయి.

వివరాలు స్పష్టంగా..: పాలసీల ఫీచర్లు, మినహాయింపులు, తరచుగా అడిగే ప్రశ్నలు, ప్రీమియం ధరల పెంపు వంటి వివరాలతో పాటు.. సేవలకు సంబంధించిన అభ్యర్థనలు, ఫిర్యాదుల మధ్య వ్యత్యాసాన్ని, వాటి పరిష్కారానికి తీసుకున్న సమయాన్ని కంపెనీలు స్పష్టంగా వెల్లడించాలి. ఈ సమాచారాన్ని త్రైమాసిక, నెలవారీ ప్రాతిపదికన వెబ్‌సైట్లలో సులభంగా చూసేందుకు, అర్థమయ్యేలా ఉంచాలి. వెబ్‌సైట్లను సందర్శించే వినియోగదారుల ఫోన్ నంబర్లు లేదా వ్యక్తిగత వివరాలు అడగకుండానే, ఈ సమాచారాన్ని వారికి అందుబాటులో ఉంచడం తప్పనిసరి. కీలక అధికారుల పనితీరు సమాచారాన్ని పంచుకోవడం వల్ల పాలసీదారులు సరైన నిర్ణయాలు తీసుకునేందుకు సాధికారత లభిస్తుందని ఐఆర్‌డీఏఐ భావిస్తోంది.

ఒకే విధానంలో:

భవిష్యత్తులో బీమా రంగం పటిష్ఠత కోసం మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు ఐఆర్‌డీఏఐ తెలిపింది. ఇతర ఆర్థిక రంగ సంస్థలతో పోల్చి, కీలకాధికారుల వేతనాలకు సంబంధించి మొత్తం బీమా రంగానికి ఒకే రకమైన విధానాన్ని అభివృద్ధి చేయడానికి లోతైన అధ్యయనం, విస్తృత సంప్రదింపులు అవసరమని గుర్తించింది. నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం, గ్రామీణ ప్రాంతాల్లో బీమా, సామాజిక బాధ్యతలను ప్రోత్సహించాలని చూస్తోంది. పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై వంటి ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సవరణలు తీసుకురానున్నట్లు ఐఆర్‌డీఏఐ సభ్యుడు రాజయ్ కుమార్ సిన్హా పేర్కొన్నారు. బీమా సంస్థల్లో నాయకత్వం నిబద్ధతతో పనిచేసి, సంస్థలోని అన్ని స్థాయిల్లో ఈ సూత్రాలను అమలు చేసినప్పుడే, పాలసీదారులకు మెరుగైన సేవలు అందుతాయని ఛైర్మన్ పేర్కొన్నారు. అప్పుడే బీమా రంగంపై నమ్మకాన్ని పెంచగలమన్నారు.

సరకు రవాణాకు జెన్2 ఎయిర్‌క్రాఫ్ట్

ఆవిష్కరించిన బ్లూజే ఏరోస్పేస్

హైదరాబాద్: వాణిజ్య అవసరాలు, సరకు రవాణా సేవల కోసం హైదరాబాద్‌కు చెందిన డీప్‌టెక్ అంకురం బ్లూజే ఏరోస్పేస్ సరికొత్త 'జెన్2' ఎయిర్‌క్రాఫ్ట్‌ను మంగళవారం ఆవిష్కరించింది. నాలుగేళ్ల పరిశోధన అనంతరం, తాము సొంతంగా అభివృద్ధి చేసిన 'వాంటిస్' ప్లాట్‌ఫామ్ ఆధారంగా తయారైన తొలి వాణిజ్య స్థాయి ఎయిర్‌క్రాఫ్ట్ ఇదని సంస్థ వెల్లడించింది. పూర్తిగా బ్యాటరీతో పనిచేసే ఈ ఎయిర్‌క్రాఫ్ట్ 500 కిలోల గరిష్ఠ టేకాఫ్ బరువుతో పనిచేస్తూ, 200 కిలోలకు పైగా బరువును (పేలోడ్) సులభంగా మోసుకెళ్లగలదు. ప్రస్తుతం ఈ నమూనా పూర్తి స్థాయి పరీక్షల దశలో ఉందని, ప్రయోగాత్మక ప్రాజెక్టులు, పేలోడ్ పరీక్షలు, వాస్తవ పరిస్థితుల్లో మూల్యాంకనానికి దీనిని వినియోగిస్తున్నట్లు బ్లూజే ఏరోస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈఓ అమర్ శ్రీ వత్సవాయ తెలిపారు.

'వాహన రంగంలో ఒకే ప్లాట్‌ఫామ్‌పై పలు మోడళ్లను తయారు చేస్తుంటారు. అదే విధంగా ఆధునిక వాయు రవాణా అవసరాలకు తగ్గట్టుగా ఎయిర్‌క్రాఫ్ట్‌లను నిర్మించే ఆర్కిటెక్చర్‌లు అవసరం. వాంటిస్ ప్లాట్‌ఫామ్ ద్వారా వివిధ వీటీఓఎల్ (రన్‌వే అవసరం లేకుండా, ఒకేసారి పైకి ఎగిరి, కిందకి దిగేవి) వేరియంట్లను వేగంగా, తక్కువ ఖర్చుతో తయారు చేయడానికి వీలవుతుంది' అని వివరించారు. భవిష్యత్తులో ఒక టన్ను బరువు మోయగల భారీ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో పాటు, ప్రయాణికుల రవాణా కోసం హైడ్రోజన్‌ఎలక్ట్రిక్ లాంగ్ రేంజ్ వేరియంట్లను 202728 నాటికి వాంటిస్ ప్లాట్‌ఫామ్ మీదే అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భారత్ పెట్రోలియం, కోచి అంతర్జాతీయ విమానాశ్రయం తదితర సంస్థలతో కలిసి హైడ్రోజన్ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే సొంతంగా టైప్4 కాంపోజిట్ హైడ్రోజన్ ట్యాంక్‌తో గ్రౌండ్ వెర్షన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. బ్లూజేలో పెట్టుబడి పెట్టిన ఎండియా పార్ట్‌నర్స్ ఎండీ సతీష్ ఆంధ్ర మాట్లాడుతూ.. భారతదేశంలో సరకు రవాణా రంగం చాలా పెద్దదైనా, ఇప్పటికీ విదేశీ సాంకేతికతపైనే ఆధారపడుతున్నాం. స్వదేశీ డీప్‌టెక్ ద్వారా ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ పరిష్కారాలను సృష్టించొచ్చు. బ్లూజే రూపొందించిన జెన్2 దీనికి నిదర్శనమన్నారు. సెమీకండక్టర్ల నుంచి ఏరోస్పేస్ వరకూ డీప్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు నిర్మించిన వారే విజయం సాధిస్తారని ఐడియాస్ప్రింగ్ క్యాపిటల్ మేనేజింగ్ పార్ట్‌నర్ నాగనంద్ దొరస్వామి అన్నారు.

17 ఏళ్ల తర్వాత ఆ ప్రయోగం..

'పెద్ది' కథను మలుపు తిప్పే మ్యాచ్ అది!

దాదాపు 17 ఏళ్ల తర్వాత 'పెద్ది'లో (Peddi Movie) దిల్లీ ఎపిసోడ్ కోసం మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించామని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. రామ్‌చరణ్ (Ram Charan) కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీ కపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న (peddi movie release date) ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విశేషాలను రత్నవేలు (cinematographer rathnavelu) పంచుకున్నారు.

అవన్నీ రీ క్రియేట్ చేశాం..

"పెద్ది' దాదాపు 40 ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కానీ, ఒకప్పటి విజయనగరానికి ప్రేక్షకులను తీసుకెళ్లాలి. అదంతా ఒక ఊహా ప్రపంచం. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజెస్ తీసుకుని, 'పెద్ది' కథను ఎలా చెప్పాలి? విజువల్‌గా ఎంత అందంగా క్రియేట్ చేయాలనే దానిపై చాలా పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ ఇలా ఒక్కో అంశాన్ని వరల్డ్ బిల్డింగ్ చేస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వారి లైఫ్ స్టయిల్ ఇలా ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది"

కథను మలుపు తిప్పే మ్యాచ్..

"పెద్ది'లో నాకు అత్యంత కష్టంగా అనిపించింది క్రికెట్ మ్యాచ్. ఇది స్పోర్ట్స్ బేస్డ్ సినిమా. కెమెరామెన్‌తో పాటు మొత్తం టీమ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు, కథలోనే ఒక పెద్ద మలుపు. ఆ మ్యాచ్‌ను రాత్రిపూట షూట్ చేద్దామని బుచ్చిబాబు గారికి సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. ఆయనకు ఆ ఆలోచన నచ్చింది"

చివరి 30 నిమిషాలు ప్రేక్షకుడిని కదలిస్తుంది..

"ఈ సినిమా క్లైమాక్స్ కూడా చాలా ఛాలెంజింగ్. ఇప్పుడే దాని గురించి ఎక్కువ చెప్పకూడదు. అది ప్రేక్షకులకు కన్నుల పండుగలా ఉంటుంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు సినిమా ప్రేక్షకులని కదిలిస్తుంది. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇందులో దిల్లీలో చిత్రీకరించిన సన్నివేశాలు నాకు చాలా ఫేవరెట్. అక్కడ నేను లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం ఫిల్మ్ నెగటివ్‌ను వాడాం. దాదాపు 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించాను. ఇప్పుడు ఉన్న డిజిటల్ కెమెరాలు అద్భుతమైన ఔట్‌పుట్ ఇస్తున్నప్పటికీ, ఒక రియల్ ఫీల్ కోసం వాడాం"

మంచి యాక్షన్ థ్రిల్లర్ తీస్తా!

"నేను ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 30 సంవత్సరాలు అయ్యింది. ఏడాదికి ఒక సినిమానే చేస్తాను. ఒక సినిమా కమిట్ అయితే అది పూర్తయ్యే వరకు వేరేవి చేయను. ఇప్పటికే మూడు కథలు రాశాను. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. అలాగే ప్రతి పాత్ర కూడా కథలో ఇంపార్టెంట్‌గా ఉండాలి. మా అబ్బాయి కూడా కెనడాలో సినిమాటోగ్రఫీ చదువుకున్నాడు. నాలాగే తనకూ సినిమాపై చాలా ప్యాషన్. 'పెద్ది'లో ఒక కుస్తీ ఫైట్ అద్భుతంగా షూట్ చేశాడు" అని అన్నారు.

హనుమంతుడి రెఫరెన్స్..

"అలాగే కుస్తీ పోటీలు కూడా మరో పెద్ద ఛాలెంజ్. ఒక గెటప్ అనుకున్న తర్వాత కాస్ట్యూమ్స్, బాడీ మార్చుకుంటే సరిపోతుంది. కానీ, ఇందులో రామ్ చరణ్ కుస్తీ విషయానికి వచ్చేసరికి తన బాడీలోని ప్రతి మజిల్‌పై వర్క్ చేశారు. ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్‌లో ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి"

రణ్‌వీర్ సింగ్‌పై బ్యాన్ కాదు.. FWICE చీఫ్ అడ్వైజర్ వివరణ

'డాన్ 3' (Don 3) సినిమా నుంచి వైదొలగడంతో ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ (Ranveer Singh)పై చర్యలు తీసుకుంటున్నట్టు 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయీస్' (ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) సోమవారం ప్రకటన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆయనపై మూడేళ్లపాటు బ్యాన్ విధించినట్టు వార్తలొచ్చిన నేపథ్యంలో.. ఎఫ్‌డబ్ల్యూఐసీఈ చీఫ్ అడ్వైజర్, ఫిల్మ్‌మేకర్ అశోక్ పండిట్ వివరణ ఇచ్చారు. అది అధికారిక బ్యాన్ కాదని స్పష్టం చేశారు. నటులపై నిషేధం విధించే అధికారం తమకు లేదని తెలిపారు. సమస్యకు పరిష్కారం లభించే వరకూ ఆయనతో కలిసి పనిచేయొద్దని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ సభ్యులను ఆదేశించామన్నారు. కారణం ఏదైనా ఓ ప్రాజెక్టు నుంచి దర్శకుడు వైదొలిగినా, నటుడు వెళ్లిపోయినా నిర్మాతకే నష్టమన్న విషయాన్ని గుర్తుచేశారు.బాలీవుడ్ నటుడు, దర్శక నిర్మాత ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించాలనుకున్న 'డాన్ 3' నుంచి వైదొలిగినట్లు ఇటీవల వార్తలొచ్చాయి. ఈ క్రమంలో..రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకూ ఆయనతో కలిసి పని చేయవద్దని ఆదేశిస్తూ ఎఫ్‌డబ్ల్యూఐసీఈ ప్రకటన జారీ చేసింది.

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసిన సినీ నిర్మాతలు

రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను (Pawan Kalyan) తెలుగు సినీ నిర్మాతలు కలిశారు. రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న ఆయనతో సినీ నిర్మాతలు రవి శంకర్, సతీశ్, నాగవంశీ, సాహు గారపాటి తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ దృష్టికి తీసుకొచ్చారు.ముఖ్యంగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు నష్టాల్లో నడుస్తున్నాయని, వాటి యజమానుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మల్టీప్లెక్స్ తరహాలోనే వచ్చిన లాభాల్లో నిర్మాతల నుంచి కొంత పర్సంటేజీ ఇస్తే, థియేటర్లు నిలదొక్కుకుంటాయన్నారు. ప్రభుత్వ పరంగా చొరవ తీసుకుని ఒక నిర్దిష్టమైన పాలసీని రూపొందించాలని కోరారు. గత కొంతకాలంగా థియేటర్ల నిర్వహణ వ్యయం పెరిగిందని, నెల వారీ ఖర్చులు కూడా అధికమయ్యాయని వివరించారు. విద్యుత్ ఛార్జీల్లో రాయితీ ఇవ్వడం ద్వారా థియేటర్ యజమానులపై భారం తగ్గుతుందని పవన్ దృష్టికి తెచ్చారు.నిర్మాతలు చెప్పిన సమస్యలు విన్న విన్న డిప్యూటీ సీఎం పవన్ సానుకూలంగా స్పందించారు. సినీ రంగ సమస్యలు పరిష్కరించేలా దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని అభయమిచ్చారు. నిర్మాతలు చేసిన ప్రతిపాదనలను పరిశీలన చేయాలని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌కు సూచించారు.

రాజ్‌తో చాలా పర్‌ఫెక్ట్: సమంత

సమంత (Samantha), బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన సినిమా 'మా ఇంటి బంగారం' (Maa Inti Bangaaram). నందిని రెడ్డి దర్శకత్వం వహించారు. జూన్ 19న (Maa Inti Bangaaram Release Date) మూవీ రిలీజ్ కానున్న సందర్భంగా.. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించారు. ఈ వేడుకలో హోస్ట్ అడిగిన ప్రశ్నలకు సమంత ఆసక్తికర సమాధానాలిచ్చారు.'రాజ్ నిడిమోరు, నందిని రెడ్డిలో ఎవరు మిమ్మల్ని ఇరిటేట్ చేశారు?' అని అడగ్గా.. ''నందినితో 15 ఏళ్ల నుంచి పరిచయం ఉంది. ఇంకా ఇరిటేషన్ ఏముంటుంది. అంతా అలవాటు అయిపోయింది. అలాగే రాజ్‌తో ఇప్పటి వరకూ వాదన లేదు. వీరిద్దరూ చాలా పర్‌ఫెక్ట్'' అని కొనియాడారు. ఈ సినిమాలో చీరకట్టులో యాక్షన్ చేశారేంటి? అని ప్రశ్నించగా మాస్‌గా ఉంది కదా అని పేర్కొన్నారు. 'మా ఇంటి బంగారం' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని, డ్రామా, కామెడీ, యాక్షన్ అన్నీ ఉన్నాయని చెప్పారు. తమది తిరుపతి అని, అందుకే ఆ యాసను సినిమాలో పెట్టామని రాజ్ ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ట్రాలాలా మూవీ పిక్చర్స్ పతాకంపై.. తన భర్త రాజ్‌తో కలిసి సమంత ఈ చిత్రాన్ని నిర్మించడం విశేషం. హిమాంక్ దువ్వూరు మరో ప్రొడ్యూసర్.నందిని రెడ్డి మాట్లాడుతూ.. ''స్టోరీ, డైలాగ్స్ విషయంలో సమంతను కన్విన్స్ చేయడం చాలా కష్టం. ఎన్నో ప్రశ్నలకు మనం సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు నటిగా మరో మెట్టు ఎక్కింది. కామెడీ, యాక్షన్, ఎమోషన్..ప్రతి దాంట్లోనూ అదరగొడుతుంది. నేను కూడా ఆమెకు అభిమానినే'' అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను గవిరెడ్డి, శ్రీముఖి, నిర్మాత హిమాంక్ తదితరులు పాల్గొన్నారు.

నాగబంధం...

ప్రాచీన దేవాలయాలు... దైవిక శక్తుల నేపథ్యంలో రూపొందుతున్న పాన్ ఇండియా స్థాయి చిత్రం... 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా నటిస్తున్నారు. నభానటేశ్, ఐశ్వర్య మేనన్ కథానాయికలు. అభిషేక్ నామా దర్శకత్వం వహిస్తున్నారు. కిశోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మాతలు. అభిషేక్ పిక్చర్స్ సమర్పిస్తోంది. ఈ చిత్రం జులై 3న ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా ప్రచార కార్యక్రమాలు ఊపందుకుంటున్నాయి. సోమవారం హైదరాబాద్‌లో త్రీడీ ప్రచార చిత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. జగపతిబాబు, మహేశ్ మంజ్రేకర్, రిషబ్ సాహ్నే తదితరులు కీలక పాత్రలు పోషించారు.

మంచు మనోజ్ మంచి మనసు.. అనాథాశ్రమాన్ని సందర్శించిన నటుడు

నటుడు మంచు మనోజ్ పెద్ద మనసు చాటుకున్నారు. అనాథాశ్రమం నిర్వాహకుల అభ్యర్థన మేరకు ఆశ్రమాన్ని సందర్శించారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో 'మాతృదేవోభవ' అనాథాశ్రమాన్ని సందర్శించి ఆయన అక్కడ మతిస్థిమితం సరిగ్గా లేని ఒక వ్యక్తికి నిర్వాహకులతో కలిసి హెయిర్ కటింగ్ చేశారు. అనంతరం కొత్త దుస్తులు ఇచ్చారు. ఆశ్రమానికి అవసరమైన టేబుళ్లు, కుర్చీలను విరాళంగా అందజేశారు.సమాజంలో ఎవరూ లేనివారికి అండగా నిలవడం గొప్ప విషయమని మనోజ్ (Manchu Manoj) అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆశ్రమానికి తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు నెలల క్రితమే 'మాతృదేవోభవ' అనాథాశ్రమం నిర్వాహకులు తనను సోషల్ మీడియాలో ట్యాగ్ చేస్తూ వీడియో పెట్టారని అది చూసి చలించిపోయినట్లు చెప్పారు. తాను రిహాబిలిటేషన్ సెంటర్ స్థాపించే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.ఇక ఇటీవలే మనోజ్ తన భార్యతో కలిసి ఐక్య సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రజల గొంతుకగా ఉండేందుకు దీన్ని ప్రారంభించినట్లు చెప్పారు. దీని కార్యకలాపాల కోసం సొంత నిధులనే వెచ్చించనున్నట్లు తెలిపారు. ఈ ట్రస్ట్ (Manchu Manoj Trust) ద్వారా రక్తదానం, చిన్నారుల దత్తత.. సహా పలు సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు వెల్లడించారు.

ఇనియన్‌కు రెండు స్వర్ణాలు

దిల్లీ: కామన్వెల్త్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత గ్రాండ్‌మాస్టర్లు అదరగొట్టారు. మూడు విభాగాల్లో కలిపి మొత్తం 8 పతకాలతో మెరిశారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో ఇనియన్ పన్నీర్ సెల్వం స్వర్ణ పతకాలు సొంతం చేసుకున్నాడు. ప్రతి విభాగంలో ఏడు రౌండ్లు ఆడిన అతడు రెండింటిలోనూ 6.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచాడు. ర్యాపిడ్ విభాగంలో శ్రీహరి రజతం, మిత్రాబా కాంస్యం గెలిచారు. బ్లిట్జ్ విభాగంలో రోహిత్ కృష్ణ రజతం దక్కించుకోగా.. శ్రీహరి కాంస్యంతో మరో పతకం తన ఖాతాలో వేసుకున్నాడు. క్లాసికల్ విభాగంలోనూ భారత్‌దే ఆధిపత్యం. మిత్రాబా టైటిల్ సొంతం చేసుకోగా.. శ్రీహరి కాంస్య పతకం దక్కించుకున్నాడు. అయితే రజతం మాత్రం శ్రీలంక ఆటగాడు రనిందు లియనాగె గెలిచాడు.

సింధు శుభారంభం

సింగపూర్: భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లో శుభారంభం చేసింది. మంగళవారం మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 2117, 2118తో పుత్రి కుసుమవర్ధనిపై విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టిపోటీనే ఎదుర్కొంది. తొలి గేమ్‌లో సింధు 40తో ఆధిక్యంలో నిలిచినా.. కుసుమవర్ధని పుంజుకుంది. 77తో స్కోరు సమం చేసింది. అక్కడ నుంచి సింధు జోరందుకుంది. 1511తో ఆధిక్యంలో నిలిచిన ఆమె.. అదే ఊపులో గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లోనూ పోరు హోరాహోరీగా జరిగింది. కీలక సమయంలో పాయింట్లు గెలిచి 1311తో ఆధిక్యంలో నిలిచిన సింధు.. అదే జోరుతో గేమ్‌ను, మ్యాచ్‌ను దక్కించుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి జంట తొలి రౌండ్లో విజయాన్ని అందుకుంది. సాత్విక్ జోడీ 2628, 2115, 2113తో చెన్ జి యాప్రెస్లీ స్మిత్ (మలేసియా) జోడీపై గెలిచింది. తొలి గేమ్‌లో మాత్రమే ప్రత్యర్థి జంట నుంచి సాత్విక్ ద్వయానికి ప్రతిఘటన ఎదురైంది. సుదీర్ఘంగా సాగిన ఈ గేమ్‌ను భారత జంట కోల్పోయినా.. తర్వాత పుంజుకుని వరుసగా రెండు గేమ్‌లు గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. లక్ష్యసేన్, ప్రణయ్, మాళవిక బుధవారం బరిలోకి దిగనున్నారు.

మెద్వెదెవ్‌కు షాక్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సంచలనాలు కొనసాగుతున్నాయి. టోర్నీ తొలి రోజు టేలర్ ఫ్రిట్జ్‌కు భారత సంతతి ఆటగాడు నిశేష్ బసవారెడ్డి షాక్ ఇవ్వగా.. తాజాగా ఆరో సీడ్ డానియల్ మెద్వెదెవ్ (రష్యా)ను ఆడమ్ వాల్టన్ (ఆస్ట్రేలియా) కంగుతినిపించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో మెద్వెదెవ్ 26, 61, 16, 61, 46తో వాల్టన్ చేతిలో కంగుతిన్నాడు. వైల్డ్‌కార్డ్ ఎంట్రీతో ఈ టోర్నీలో ఆడుతున్న వాల్టన్.. ఈ మ్యాచ్‌లో ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. తొలి సెట్‌ను కైవసం చేసుకుని మెద్వెదెవ్‌కు సవాల్ విసిరాడు. కానీ రెండో సెట్లో మెద్వెదెవ్ పుంజుకున్నాడు. ప్రత్యర్థికి ఒకే గేమ్ కోల్పోయి సెట్ గెలిచాడు. తర్వాతి రెండు సెట్లను మెద్వెదెవ్‌వాల్టన్ పంచుకోవడంతో అయిదో సెట్ కీలకంగా మారింది. స్కోరు 44తో ఉన్న సమయంలో తొమ్మిదో గేమ్‌లో మెద్వెదెవ్ సర్వీస్ బ్రేక్ చేసిన వాల్టన్.. అదే జోరుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మ్యాచ్‌లో వాల్టన్ 3 ఏస్‌లు, 34 విన్నర్లు కొట్టాడు. 5 డబుల్‌ఫాల్ట్స్, 60 అనవసర తప్పిదాలు చేసిన మెద్వెదెవ్ ఓటమి కొనితెచ్చుకున్నాడు. ఓటమి అనంతరం ఈ రష్యా స్టార్ రాకెట్‌ను విరగొట్టి అసహనాన్ని వ్యక్తం చేశాడు. సిలిచ్ (క్రొయేషియా) 67 (47), 26, 16తో కొసుమ్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు. ముల్లర్ (ఫ్రాన్స్)తో మ్యాచ్‌లో సిట్సిపాస్ (గ్రీస్) 62, 30తో ఆధిక్యంలో ఉన్న సమయంలో ప్రత్యర్థి గాయంతో వైదొలిగాడు.

సబలెంకా జోరు: టైటిల్ ఫేవరెట్ అర్యానా సబలెంకా (బెలారస్) తొలి రౌండ్లో 64, 62తో బొజాస్ (స్పెయిన్)ను ఓడించింది. డిఫెండింగ్ ఛాంపియన్ కొకో గాఫ్ (అమెరికా) 64, 60తో టౌన్‌సెండ్ (అమెరికా)పై నెగ్గింది. జపాన్ స్టార్ నవోమి ఒసాకా 63, 76 (73)తో సిగ్మండ్ (జర్మనీ)పై, వికిచ్ (క్రొయేషియా) 63, 62తో అలీస్ ట్యూబెల్ (ఫ్రాన్స్), సకారి (గ్రీస్) 75, 76 (73)తో నోస్కోవా (చెక్)పై నెగ్గారు.

బాలాజీ, యుకి ముందంజ: పురుషుల డబుల్స్‌లో శ్రీరామ్ బాలాజీడిమోలినర్ (బ్రెజిల్) జంట ముందంజ వేసింది. తొలి రౌండ్లో బాలాజీ జోడీ 63, 46, 63తో ఫ్రాంట్‌జెన్ (జర్మనీ)హాస్ (నెదర్లాండ్స్) ద్వయంపై నెగ్గింది. యుకి బాంబ్రిమైకేల్ వీనస్ (ఆస్ట్రేలియా) జంట 75, 62తో సెరున్‌డోలోకెస్టెల్‌బోమ్ (అర్జెంటీనా) జోడీని ఓడించింది.

మళ్లీ వచ్చేశారు..

వరుసగా రెండోసారి ఫైనల్లో బెంగళూరు

క్వాలిఫయర్-1లో గుజరాత్ చిత్తు చిత్తు పాటీదార్ విధ్వంసం

వారెవ్వా బెంగళూరు! ఏమి జోరు.. ఏమి ఆధిపత్యం! ఎన్నో అవమానాలను సహించి, ఎంతో నిరాశ తట్టుకుని 17 ఏళ్ల యాతన అనంతరం నిరుడు ఐపీఎల్ విజేతగా నిలిచిన బెంగళూరు.. ఆ విజయం గాలివాటమేమీ కాదని బలంగా నిరూపిస్తూ ఈ సీజన్‌లోనూ చెలరేగిపోతోంది. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో ఆ జట్టు వరుసగా రెండో ఏడాదీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. బెంగళూరు రెండో టైటిల్‌కు ఇంకొక్క అడుగే దూరం!

అదిరే ఆటతో లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచి ప్లే ఆఫ్స్‌లో అడుగుపెట్టిన ఆర్సీబీ.. క్వాలిఫయర్ 1లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. కెప్టెన్ రజత్ పాటీదార్ విధ్వంసక విన్యాసాలతో విరుచుకుపడ్డ వేళ.. ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. పరుగుల వరద పారించి కొండంత లక్ష్యాన్ని నిర్దేశించిన డిఫెండింగ్ ఛాంపియన్.. ఆ తర్వాత బంతితో ప్రత్యర్థిని అలవోకగా చుట్టేసింది. బ్యాటింగ్‌లో చేతులెత్తేసిన టైటాన్స్ ఘోరపరాజయాన్ని చవిచూసింది. ఛేదనలో అర గంటలోనే ఆ జట్టు పనైపోయింది. ఓడినా.. ఫైనల్ చేరేందుకు గుజరాత్‌కు మరో అవకాశముంది. ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్2లో గిల్ బృందం తలపడుతుంది.

అభిమానుల్లో ఎంతో ఆసక్తిరేపిన క్వాలిఫయర్1 చప్పగా ముగిసింది. తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు..మంగళవారం ఏమాత్రం పోటీలేని పోరులో 92 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై ఘనవిజయం సాధించింది. రజత్ పాటీదార్ (93; 33 బంతుల్లో 5×4, 9×6) వీరవిహారంతో మొదట ఆర్సీబీ 5 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీ స్కోరు సాధించింది. విరాట్ కోహ్లి (43; 25 బంతుల్లో 5×4, 1×6), కృనాల్ పాండ్య (43; 28 బంతుల్లో 5×4, 2×6) రాణించారు. ఛేదనలో గుజరాత్ ఘోరంగా విఫలమైంది. 19.3 ఓవర్లలో 162 పరుగులకే కుప్పకూలింది. జాకబ్ డఫీ (3/39), రసిఖ్ సలామ్ (2/24), భువనేశ్వర్ (2/28), హేజిల్‌వుడ్ (1/39) టైటాన్స్‌ను దెబ్బతీశారు. రాహుల్ తెవాతియా (68; 43 బంతుల్లో 8×4, 4×6) టాప్ స్కోరర్.

టైటాన్స్ టపటపా: 255 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం చాలా కష్టమైన పనే. కానీ గుజరాత్ ఆట పేలవం. విజయం కోసం ప్రయత్నించడం సరి కదా.. కనీస ప్రతిఘటన అయినా లేకుండానే ఆ జట్టు తలవంచింది. చెత్త బ్యాటింగ్‌తో దాసోహమంది. పవర్ ప్లే అయినా పూర్తిగా కాకముందే టైటాన్స్ పరాజయం ఖాయమైపోయింది. 51/5.. 5.4 ఓవర్లలో ఆ జట్టు పరిస్థితి. ఏమాత్రం అవకాశాలు ఉండాలన్నా బలమైన ఆరంభం అవసరమైన స్థితిలో టైటాన్స్ తేలిపోయింది. వెన్నెముక లాంటి టాప్ ఆర్డర్ విఫలం కావడం ఆ జట్టును గట్టి దెబ్బతీసింది. టోర్నీ ఆరంభం నుంచి బలమైన ఆరంభాలనిస్తోన్న ఓపెనర్లు 27 పరుగులకే వెనుదిరిగారు. మూడో ఓవర్లో డఫీ బౌలింగ్‌లో సాయిసుదర్శన్ (14) దురదృష్టవశాత్తూ వెనుదిరిగాడు. ఫోర్ కొట్టాక నియంత్రణ కోల్పోయి బ్యాటును వదిలేయగా, అది వెళ్లి స్టంప్‌స్‌ను తాకింది. వెంటనే భువనేశ్వర్ బౌలింగ్‌లో గిల్ (2) బౌల్డయ్యాడు. ధాటిగా మొదలెట్టిన బట్లర్ (29)ను హేజిల్‌వుడ్ ఓ లెగ్‌కటర్‌తో బౌల్డ్ చేశాడు. నిశాంత్ సింధు (5), హోల్డర్ (0)ను రసిఖ్ సలామ్ ఒకే ఓవర్లో ఔట్ చేశాడు. పావు వంతు లక్ష్యమైనా కరగకముందే సగం వికెట్లు పడిపోవడంతో టైటాన్స్ పరాజయం లాంఛనమే అయింది. ఆ తర్వాత ఆటలో ఎలాంటి ఆసక్తీ మిగల్లేదు. తెవాతియా మెరుపులు ఓటమి అంతరాన్ని తగ్గించాయంతే.

దంచికొట్టిన పాటీదార్: కెప్టెన్ రజత్ పాటీదార్ ఊచకోతతో అంతకుముందు బెంగళూరు కొండంత స్కోరు చేయగలిగింది. కోహ్లి, కృనాల్ కూడా విలువైన పరుగులు చేసినా.. ఆర్సీబీకి తిరుగులేని స్కోరును అందించింది పాటీదార్ విధ్వంసమే. ఆ జట్టును కట్టడి చేసినా అవకాశం లభించినా.. గుజరాత్ ఉపయోగించుకోలేకపోయింది. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్నందుకు టైటాన్స్ చింతించక తప్పలేదు. ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (19)ను రబాడ త్వరగానే వెనక్కి పంపినా.. కోహ్లి, పడిక్కల్ (30; 19 బంతుల్లో 5×4) ధాటైన బ్యాటింగ్‌తో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. కోహ్లి సాధికారిక బ్యాటింగ్‌తో చకచకా బౌండరీలు బాదాడు. రబాడ వేసిన ఓ ఓవర్లో రెండు ఫోర్లు, సిక్స్‌తో అలరించాడు. పడిక్కల్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో ఆర్సీబీ 8 ఓవర్లలో 92/1తో భారీ స్కోరు దిశగా పరుగులు తీసింది. కానీ హోల్డర్ ఒకే ఓవర్లో కోహ్లి, పడిక్కల్‌ను ఔట్ చేసి ఆ జట్టును పోటీలోకి తెచ్చాడు. అయితే పరిస్థితిని గుజరాత్ సద్వినియోగం చేసుకోలేకపోయింది. పాటీదార్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో ఆ జట్టుకు షాకిచ్చాడు. నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డ అతడు.. ప్రత్యర్థి బౌలర్లకు తమపై ఒత్తిడి తెచ్చే అవకాశమివ్వలేదు. కళ్లు చెదిరే స్ట్రోక్ ప్లేతో పరుగుల వరద పారించాడు. మరోవైపు కృనాల్ పాండ్య కూడా బ్యాట్ ఝుళిపిస్తూ తోడుగా నిలవగా.. బౌలర్ల గణాంకాలను సవరిస్తూ పోయాడు పాటీదార్. హోల్డర్ బంతిని సిక్స్‌కు పుల్ చేసి విధ్వంసాన్ని మొదలెట్టిన అతడు ఏ దశలోనూ తగ్గలేదు. ఖ్రోలియా ఓవర్లో వరుసగా 4, 6, 4తో విరుచుకుపడ్డ అతడు.. మూడు సిక్స్‌లతో రషీద్ ఖాన్‌కు చుక్కలు చూపించాడు. 21 బంతుల్లోనే అర్ధశతకం బాదిన పాటీదార్, ఆ తర్వాత కూడా విధ్వంసాన్ని కొనసాగించాడు. కృనాల్, టిమ్ డేవిడ్ (4) ఔటైనా.. పాటీదార్ భీకర దాడులతో ఆఖరి నాలుగు ఓవర్లలో బెంగళూరు ఏకంగా 65 పరుగులు రాబట్టింది. రబాడ ఓవర్లో పాటీదార్ రెండు సిక్స్‌లు దంచాడు. అతడు వరుసగా 6, 4.. జితేశ్ వరుసగా 4, 6 బాదడంతో 19వ ఓవర్లో సిరాజ్ ఏకంగా 21 పరుగులు సమర్పించుకున్నాడు. ఆఖరి ఓవర్లో (ప్రసిద్ధ్) పాటీదార్ మరో రెండు సిక్స్‌లు కొట్టడంతో బెంగళూరు స్కోరు 250 దాటింది.

బెంగళూరు ఇన్నింగ్స్: వెంకటేశ్ (సి) గిల్ (బి) రబాడ 19; కోహ్లి (బి) హోల్డర్ 43; పడిక్కల్ (సి) బట్లర్ (బి) హోల్డర్ 30; పాటీదార్ నాటౌట్ 93; కృనాల్ (సి) సుదర్శన్ (బి) రబాడ 43; డేవిడ్ (బి) ప్రసిద్ధ్ 4; జితేశ్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 7 మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 254; వికెట్ల పతనం: 121, 293, 394, 4189, 5214; బౌలింగ్: సిరాజ్ 30460; రబాడ 40542; హోల్డర్ 40392; రషీద్ 3-0-29-0; ప్రసిద్ధ్ 4-0-53-1; ఖ్రోలియా 2-0-31-0

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ హిట్‌వికెట్ (బి) డఫీ 14; గిల్ (బి) భువనేశ్వర్ 2; బట్లర్ (బి) హేజిల్‌వుడ్ 29; నిశాంత్ సింధు (సి) అండ్ (బి) సలామ్ 5; సుందర్ (సి) హేజిల్‌వుడ్ (బి) డఫీ 8; హోల్డర్ (సి) హేజిల్‌వుడ్ (బి) రసిఖ్ 0; తెవాతియా (సి) పాటీదార్ (బి) భువనేశ్వర్ 68; రషీద్ (సి) జితేశ్ (బి) డఫీ 8; రబాడ (సి) కోహ్లి (బి) కృనాల్ 9; సిరాజ్ (సి) డేవిడ్ (బి) కృనాల్ 5; ప్రసిద్ధ్ నాటౌట్ 6; ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: (19.3 ఓవర్లలో ఆలౌట్) 162; వికెట్ల పతనం: 117, 227, 351, 451, 551, 665, 778, 888, 9156; బౌలింగ్: డఫీ 40393; భువనేశ్వర్ 40282; హేజిల్‌వుడ్ 4-0-3-9-1; రసిఖ్ 3-1-24-2; కృనాల్ 3.30162; షెపర్డ్ 1-0-15-0

ముందుకెవరో.. ఇంటికెవరో!

ఎలిమినేటర్‌లో నేడు హైదరాబాద్ × రాజస్థాన్

ఐపీఎల్‌లో మరో రసవత్తర సమరానికి వేళైంది. బుధవారం జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను రాజస్థాన్ రాయల్స్ ఢీకొంటుంది. లీగ్ దశలో నిలకడగా రాణించిన సన్‌రైజర్స్ భీకరంగా కనిపిస్తుంటే.. తన చివరి రెండు మ్యాచ్‌ల్లో విజయాలతో ప్లేఆఫ్స్ చేరిన రాజస్థాన్, ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు క్వాలిఫయర్-2లో ఆడుతుంది. ఓడే జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. కాబట్టి విజయం కోసం ఇరు జట్లు హోరాహోరీగా తలపడతాయనడంలో సందేహం లేదు.

గత సీజన్ పేలవ ప్రదర్శనను మరిపిస్తూ, ఈసారి ప్లేఆఫ్స్ చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. బుధవారం రాజస్థాన్‌ను ఇంటిముఖం పట్టించి క్వాలిఫయర్2కు అర్హత సాధించాలని పట్టుదలతో ఉంది. లీగ్ దశలో సన్‌రైజర్స్ 14 మ్యాచ్‌ల్లో 9 విజయాలు సాధించింది. ఆర్సీబీ, గుజరాత్‌లతో సమానంగా 18 పాయింట్లు సంపాదించినా.. రన్‌రేట్ వల్ల పాయింట్ల పట్టికలో మూడో స్థానంతో సరిపెట్టుకుంది. మరోవైపు రాజస్థాన్ 8 విజయాలతో నాలుగో స్థానం దక్కించుకుంది. రెండూ బలమైన జట్లే. ఎవరిది పైచేయి అవుతుందన్నది ఆసక్తికరం.

జోరుమీద సన్‌రైజర్స్: సన్‌రైజర్స్ సూపర్ ఫామ్‌లో ఉంది. అన్ని విభాగాల్లో బలంగా కనిపిస్తోన్న ఆ జట్టుదే ఈ ఎలిమినేటర్‌లో కాస్త పైచేయిగా కనిపిస్తోందనడంలో సందేహం లేదు. టోర్నీని నెమ్మదిగా ఆరంభించిన ఎస్‌ఆర్‌హెచ్.. తర్వాత జోరందుకుంది. తన చివరి పది మ్యాచ్‌ల్లో ఆ జట్టు ఎనిమిది గెలిచింది. చివరి ఏడు గేములకు కెప్టెన్ కమిన్స్ అందుబాటులోకి రావడం ఆ జట్టుపై సానుకూల ప్రభావం చూపింది. ఈ సీజన్‌లో రాజస్థాన్‌తో ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలవడం హైదరాబాద్‌ను మానసికంగా పైచేయిలో నిలుపుతోంది. ఆ జట్టు బ్యాటింగ్ లైనప్ భీకరంగా కనిపిస్తోంది. టాప్4 బ్యాటర్లు అభిషేక్ శర్మ (563 పరుగులు), హెడ్ (393), ఇషాన్ కిషన్ (569), క్లాసెన్ (606) ఫామ్‌లో ఉన్నారు. వీళ్లను నియంత్రించడం రాజస్థాన్ బౌలర్లకు సవాలే. అయితే హెడ్‌లో నిలకడ లోపించింది. మరోవైపు ప్రభావవంతమైన బౌలింగ్ సన్‌రైజర్స్ సొంతం. కెప్టెన్ కమిన్స్ 7 మ్యాచ్‌ల్లో 8.67 ఎకానమీ రేట్‌తో 8 వికెట్లు పడగొట్టాడు. ఇషాన్ మలింగ (19 వికెట్లు), సాకిబ్ హుస్సేన్ (15) ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మధ్య ఓవర్లలో స్పిన్నర్ శివాంగ్ రాణిస్తున్నాడు. అయితే ఈ కీలక సమరంలో రాయల్స్ విధ్వంసక ఓపెనర్ వైభవ్ సూర్యవంశీని వీళ్లు ఎంత మేరకు కట్టడి చేయగలరన్నదానిపె ఫలితం ఆధారపడి ఉంది.

ఉత్సాహంగా రాయల్స్: రాజస్థాన్ రాయల్స్ కూడా ఉత్సాహంగా పోరుకు సిద్ధమైంది. ఆ జట్టు చాలా ముందే ప్లేఆఫ్‌కు అర్హత సాధించాల్సింది. కానీ తొలి నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచి ఘనంగా లీగ్‌ను ఆరంభించిన ఆ జట్టు.. మధ్యలో తడబడి ఆఖరి మ్యాచ్ వరకు తెచ్చుకుంది. సన్‌రైజర్స్ అంత కాకపోయినా రాజస్థాన్ టాప్ ఆర్డర్ కూడా బలంగానే ఉంది. వైభవ్ సూర్యవంశీ (583), యశస్వి జైస్వాల్ (397), ధ్రువ్ జురెల్ (458) తమ జట్టు పరుగుల బాధ్యతను తీసుకున్నారు. జైస్వాల్ మరింత నిలకడగా రాణించడం అసవరం. అయితే ఇప్పుడు అందరి దృష్టి మాత్రం 15 ఏళ్ల వైభవ్ పైనే. సన్‌రైజర్స్‌కు అతి పెద్ద సవాల్ అతడు. వైభవ్ పవర్‌ప్లే పూర్తయ్యే వరకు క్రీజులో ఉంటే అలవోకగా రాయల్స్‌ను పైచేయిలో నిలపగలడు. కాబట్టి అతడిపై హైదరాబాద్ ప్రత్యేక దృష్టి నిలుపుతుందనడంలో సందేహం లేదు. కెప్టెన్ పరాగ్ ఈ పోరులో అయినా ఓ పెద్ద ఇన్నింగ్స్ ఆడాలని జట్టు ఆశిస్తోంది. ఇక బౌలింగ్‌లో జోఫ్రా ఆర్చర్ రాజస్థాన్‌కు చాలా కీలకం. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో తమను గెలిపించిన అతడిపై ఆ జట్టు ఎన్నో ఆశలు పెట్టుకుంది. టోర్నీ ఆసాంతం ఆర్చర్ (8.76 ఎకానమీతో 21 వికెట్లు) గొప్పగా బౌలింగ్ చేశాడు. మరో ఇద్దరు పేసర్లు బ్రిజేశ్ శర్మ (13 వికెట్లు) బర్గర్ (11 వికెట్లు) కూడా మెరుగైన ప్రదర్శనే చేశారు. యువ లెగ్‌స్పిన్నర్ యశ్‌రాజ్ పుంజా (8 వికెట్లు) విశేషంగా రాణిస్తుండడం రాజస్థాన్‌కు సానుకూలాంశం. ఆల్‌రౌండర్ జడేజా (8 వికెట్లు, 209 పరుగులు) నుంచి బ్యాటుతో, బంతితో రాయల్స్ మరింతగా ఆశిస్తోంది.

తుది జట్లు (అంచనా)

హైదరాబాద్: అభిషేక్, హెడ్, ఇషాన్, క్లాసెన్, నితీశ్, సలీల్ అరోరా, కమిన్స్ (కెప్టెన్), శివాంగ్, మలింగ, సాకిబ్, ప్రఫుల్/హర్షల్.

రాజస్థాన్: యశస్వి, వైభవ్, జురెల్, పరాగ్ (కెప్టెన్), ఫెరీరా, శుభమ్ దూబె, జడేజా, ఆర్చర్, బర్గర్, పుంజా, బ్రిజేశ్.

23..... రాజస్థాన్‌తో హైదరాబాద్ ఆడిన మ్యాచ్‌లు. ఆ జట్టు 14 మ్యాచ్‌ల్లో నెగ్గగా.. రాయల్స్ 9 విజయాలు సాధించింది. ఈ సీజన్‌లో తలపడ్డ రెండు మ్యాచ్‌ల్లో సహా.. రాయల్స్‌తో ఆడిన గత అయిదు మ్యాచ్‌ల్లోనూ సన్‌రైజర్సే నెగ్గడం విశేషం.